




www.aksharamtelugudaily.com RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

FRIDAY 31ST JULY 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 09 ISSUE : 135 COST : 3\- KHAMMAM, TELANGANA

శుక్రవారం 31 జూలై 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 09 సంచిక :135 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI


## ఎన్నికల్లో గెలవకుండా మంత్రిగా ఇంకెంతకాలం

వరుసగా రెండుసార్లు మంత్రిగా కొనసాగడం సరికాదు


బీహార్ మంత్రి దీపక్ ప్రకాశ్‌ను ఉద్దేశించి సుప్రీం వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,జూలై30 ఎన్నికల్లో గెలవని వ్యక్తిని ఇంకెంతకాలం మంత్రిగా కొనసాగిస్తారని బిహార్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఆ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దీపక్ ప్రకాశ్ ను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేసింది. ఆరు నెలల గడువు ముగిసిన తర్వాత కూడా ఆ పదవిలో కొనసాగించడంపై సమాధానం చెప్పాలని సమ్రాట్ చౌధరీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. సాధారణంగా ఎన్నికల్లో గెలవని వ్యక్తులు రాష్ట్ర మంత్రిగా నియమితులైతే.. వారు ఆరునెలల్లోగా ఏదో ఒక నియోజకవర్గం నుంచి గెలివాల్సి ఉంటుంది.



# ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు

- పొంగిపొర్లుతున్న వాగులు వంకలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి, ప్రాణహిత నదులు
- మేడిగడ్డ వద్ద వరద ఉధృతితో 85 గేట్లు ఎత్తివేత
- శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు పెరిగిన వరద ఉధృతి
- కడెం జలాశయానికి భారీగా వరదనీరు చేరిక
- భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి మట్టం
- ములుగు జిల్లా బొగత జలపాతం సందర్శన నిలిపివేత



హైదరాబాద్,జూలై30 వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం కారణంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తున్నాయి. అలాగే రానున్న మరో మూడు రోజుల పాటు తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. తెలంగాణ వ్యాప్తంగా

➤ మిగతా 2వ పేజిలో..

# తెలంగాణ విద్యారంగం బలోపేతానికి కృషి

- కార్పోరేట్‌కు దీటుగా పాఠశాలల అభివృద్ధి
- పిల్లల భవిష్యత్ తీర్చి దిద్దేందుకే విద్యాశాఖ చూస్తున్నా
- పిల్లలను హాస్టళ్లలో వేయడంతో దెబ్బతింటున్న కుటుంబ బంధాలు
- మండలం క్లస్టర్‌గా విద్యా ప్రణాళిక రూపొందిస్తున్నాం
- ఉపాధ్యాయుల పదోన్నతలపై అనుమానాలు వద్దు
- 2034 వరకు నేనే ముఖ్యమంత్రిగా ఉంటా
- సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్,జూలై30 తెలంగాణను విద్యాపరంగా అగ్రగామిగా నిలబెట్టేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. స్కూళ్లను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యారంగాన్ని పూర్తిస్థాయిలో బలోపేతం చేసేందుకే రాష్ట్ర బడ్జెట్‌లో ఏకంగా 9 శాతం నిధులను ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. ఓట్ల రాజకీయం కోసం కాకుండా, పిల్లల బంగారు భవిష్యత్తును దిద్ది తీర్చాలనే ఏకైక లక్ష్యంతోనే విద్యాశాఖ బాధ్యతలను తాను స్వయంగా పర్యవేక్షిస్తున్నానని తెలిపారు. గతంలో ఉన్నవారు ఇరిగేషన్ శాఖను ఎంచుకుంటే, నేను విద్యాశాఖ బాధ్యతను నా వద్దే ఉంచుకున్నా. 80 వేల పుస్తకాలు చదివానన్న నాయకుడి కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయింది. కానీ నా ప్రాధాన్యత ప్రాజెక్టులు కావు, పిల్లల చదువులే అని సీఎం అన్నారు. లక్షల మంది ఇంజనీరింగ్ పట్టాలు పొందుతున్నా, ఉద్యోగానికి దరఖాస్తు రాసుకోలేని పరిస్థితి రాకూడదని, విద్యా ప్రమాణాలను పెంచడమే తమ నైతిక బాధ్యత అని స్పష్టం చేశారు. చిన్నతనంలోనే పిల్లలను హాస్టళ్లలో వేయడం వల్ల కుటుంబ సంబంధాలు దెబ్బ తింటున్నా యని ఆందోళన వ్యక్తం చేశారు. ఒంటరిగా పెరిగే పిల్లలు పెద్దయ్యాక తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పంపే ప్రమాదం ఉందన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యా యులే తల్లిదండ్రుల స్థానంలో ఉండి పిల్లలకు సరైన మార్గదర్శనం చేయాలని పిలుపునిచ్చారు. ప్రత్యామ్నాయంగా

➤ మిగతా 2వ పేజిలో..

# అంగన్‌వాడీ వ్యవస్థ మరింత బలోపేతం



- అంగన్‌వాడీ టీచర్ల నుంచి నేరుగా సలహాల స్వీకరణ
- జిల్లాల వారీగా ప్రత్యేక సదస్సుల నిర్వహణ
- అధికారులతో సమీక్షించిన మంత్రి సీతక్క

హైదరాబాద్,జూలై30 అంగన్‌వాడీ వ్యవస్థను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. అందులో భాగంగా అంగన్‌వాడీ టీచర్ల నుంచి నేరుగా సలహాలు, సూచనలు స్వీకరించేందుకు జిల్లాల వారీగా ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని అధికారులను

➤ మిగతా 2వ పేజిలో..

# రాజ్యసభకు చేరిన ప్రశ్నాపత్రాల లీకేజీ నిరోధక బిల్లు

- లీకులపై కఠిన చర్యల కోసమే బిల్లు అని చెప్పిన మంత్రి
- విద్యార్థులపై లాఠీఛార్జ్‌పై అమిత్ క్షమాపణలు చెప్పాలన్న ఖర్గే



న్యూఢిల్లీ,జూలై30 ప్రశ్నపత్రాల లీకేజీ నిరోధానికి ప్రభుత్వం తీసుకొచ్చిన 'పబ్లిక్ పరీక్షల (అనుచిత పద్ధతుల నివారణ) సవరణ బిల్లు 2026' రాజ్యసభ ముందుకు వచ్చింది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ దీనిని సభలో ప్రవేశపెట్టారు. దీనిపై ఏడు గంటల పాటు చర్చించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. ప్రశ్నపత్రాల లీకులను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని, ఏమాత్రం సహించే ప్రసక్తే లేదన్నారు. పిల్లల భవిష్యత్తును ప్రమాదంలో పడేయడాన్ని అనుమతించబోమన్నారు. దేశంలోని విద్యార్థులు, యువత సంక్షేమాన్ని పరిరక్షించడంలో ప్రభుత్వ నిబద్ధతకు ఈ బిల్లు నిదర్శనమని చెప్పారు. ఈ బిల్లును తీసుకురావడానికి ప్రధాని ఏ మాత్రం ఆలస్యం చేయలేదని కేంద్ర మంత్రి వెల్లడించారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి ప్రధాని మోదీ కుర్చీ కాపాడారని రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. యాంటీ పేపర్ లీక్ బిల్లుపై మాట్లాడుతూ.. 'నీట్ పేపర్ లీక్ వల్ల చాలా మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. పేపర్ లీక్ కాకుండా ప్రభుత్వం ఏమాత్రం ముందస్తు చర్యలు చేపట్టలేదు. 2024లోనే ఈ బిల్లును ఎందుకు తీసుకురాలేదు? దిల్లీలో విద్యార్థుల విషయంలో పోలీసులు వ్యవహరించిన తీరుపై అమిత్‌షా ఎందుకు మౌనంగా ఉన్నారు? ఈ ఘటనకు

➤ మిగతా 2వ పేజిలో..

## వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు

- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్,జూలై30 వాయుగుండం ప్రభా వం నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో అధికారులు అప్రమ త్తంగా ఉండా లని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించా రు. ఛత్తీస్‌గఢ్ మీదు గా పయనిస్తున్న తీవ్ర వాయుగుండం, చురుగ్గా ఉన్న నైరుతి రుతుపవనాల ప్రభావంతో తెలంగాణవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక చేసింది. ఈ నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయిలో రెవెన్యూ యంత్రాంగం అన్ని శాఖలతో సమన్వయం చేసుకొని నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో

➤ మిగతా 2వ పేజిలో..

## సోషల్ మీడియాలో ప్రధాని రాజీనామా లేఖ

- ఫేక్ లేఖగా గుర్తించిన కేంద్ర సంస్థ పిఐబి



న్యూఢిల్లీ,జూలై30ప్రధాని నరేంద్ర మోదీ రాజీనామా చేసినట్లు ఆయన సంతకంతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న లేఖ పూర్తిగా ఫేక్ అని కేంద్ర ప్రభుత్వ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం నిర్ధారించింది. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి అలాంటి లేఖ ఏదీ విడుదల కాలేదని, మోదీ కూడా దానిపై సంతకం చేయలేదని స్పష్టం చేసింది. నెట్టింట చక్కర్లు కొడుతున్న ఈ ఫేక్ లెటర్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అధికారిక వర్గాల నుంచి నిర్ధారణ చేసుకోకుండా ఇలాంటి సందేశాలను నమ్మకూడదని, ఫార్వర్డ్ చేయకూడదని 'ఎక్స్' వేదికగా పీఐబీ సూచించింది. 'ప్రధాని సంతకంతో ప్రచారంలో

➤ మిగతా 2వ పేజిలో..



## వందేమాతరం గీతానికి పార్లమెంట్ ఆమోదం

లోక్‌సభలో ఆమోదం పొందిన బిల్లు

న్యూఢిల్లీ,జూలై30: వందేమాతరం గేయాన్ని అవమానించడం నేరంగా పరిగణించే బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించింది. రాజ్యసభలో ఆమోదం పొందిన బిల్లుకు లోక్‌సభ కూడా తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో త్వరలో ఇది చట్ట రూపం దాల్చనుంది. ప్రతిపక్షాల నిరసనల నడుమ లోక్‌సభ నేడు మూజువాణి ఓటుతో బిల్లుకు ఆమోదం తెలిపింది. జాతీయ గేయాన్ని

➤ మిగతా 2వ పేజిలో..

## తెలంగాణ విద్యారంగం బలోపేతానికి కృషి

, ప్రతి మండలాన్ని ఒక క్లస్టర్‌గా తీసుకుని విద్యా ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. విద్యాబోధనలో అంతర్జాతీయ ప్రమాణాలు అందించేందుకు ఏటా 10 నుండి 12 మంది ఉపాధ్యాయులను 'స్టడీ లీవ్'పై విదేశాలకు పంపిస్తామని ప్రకటించారు. టీచర్ల ప్రమోషన్లు, బదిలీల బాధ్యతను తానే చూసుకుంటానని, అడగకుండానే ఒకటో తేదీన జీతాలు వేస్తున్నామని గుర్తుచేశారు. ఇదే క్రమంలో తన రాజకీయ ప్రస్థానంపై స్పందిస్తూ 2034 వరకు నేనే సీఎంగా ఉంటాను, ఎలాంటి సందేహాలు వద్దని ధీమా వ్యక్తం చేశారు. దీనిపై ఎవరూ ఎలాంటి అనుమానాలు, డౌట్లు పెట్టుకోవాల్సిన అవసరం లేదని ధీమా వ్యక్తం చేశారు. ఫిన్‌లాండ్, జర్మనీ పర్యటన ముగించుకుని వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ఉపాధ్యాయుల బృందంతో ఇవాళ ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ లో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ భేటీలో సీఎం మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్వహణలో తాము మానవత్వంతో వ్యవహరిస్తూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులతో మాట్లాడిన సీఎం, వారి సమస్యల పరిష్కార బాధ్యతను పూర్తిగా తానే తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రమోషన్లు, బదిలీలు ఇంటికే వస్తాయని, ఉపాధ్యాయులు కేవలం విద్యార్థుల భవిష్యత్తు, బడులలో సౌకర్యాల పైనే దృష్టి పెట్టాలని కోరారు. ఐఏఎస్ అధికారులనైనా సులభంగా బదిలీ చేయవచ్చుని, కానీ టీచర్ వ్యవస్థ అత్యంత శక్తివంతమైనదని కొనియాడారు. బడులలోని పిల్లల సమస్యలపై తనతో చర్చలకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ బడులలో చదివితే ఏం అవుతావు?' అని ఎవరైనా అడిగితే, 'తెలంగాణ సీఎం అవుతాను' అని పిల్లలు ధైర్యంగా చెప్పాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తాను స్వయంగా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుని, ఎలాంటి మంత్రి పదవి అనుభవం లేకపోయినా ఈరోజు సమర్థవంతంగా రాష్ట్రాన్ని పాలిస్తున్నానని గుర్తుచేశారు. ఇటీవల తాను హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో చదువుకున్నానని చెబుతూ, కేవలం తెలివి ఉంటే సరిపోదని, క్రమశిక్షణెళి మనిషిని ఉన్నత స్థానంలో నిలబెడుతుందని నొక్కి చెప్పారు. ఉపాధ్యాయులు అడగకపోయినా 2024 జనవరి నుంచి ప్రతినెల ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి కూడా సమయానికి వేతనాలు ఇస్తున్నామని స్పష్టం చేశారు. అలాగే హాస్టళ్లలో డైట్, కాస్మోటిక్

ఛార్జీలను సైతం పెంచామని వివరించారు. అమెరికాపైనే కాకుండా జర్మనీ, జపాన్ వంటి దేశాల వైపు దృష్టి సారించాలని, భాష అనేది కేవలం ఒక సంభాషణ మాధ్యమం మాత్రమేనని పేర్కొన్నారు. ప్రతి ఆరు నెలలకొకసారి ఉపాధ్యాయ సంఘాలతో సమావేశమై సమస్యలు పరిష్కరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఇకపోతే ప్రధానమంత్రి నరేంద్రమోదీ అప్పులు ఎక్కువగా చేశారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అందరూ ప్రధాన మంత్రుల కంటే మోదీ అప్పులు ఎక్కువ చేశారని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 2014 వరకూ రూ.51లక్షల కోట్ల అప్పు ఉందని వివరించారు. 2014 నుంచి ఇప్పటివరకు ప్రధాని రూ.151లక్షల కోట్ల అప్పులు చేశారని తెలిపారు. విమర్శలు గుర్తు చేసుకుంటూ ఉంటే మనం మనుగడ సాధించలేమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావుకి సీఎం రేవంత్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. విద్యావ్యవస్థ తమ హయాంలో బలపడిందని తెలిపారు. 28వ స్థానంలో ఉన్న మన రాష్ట్రం ఇప్పుడు దేశంలో 18వ స్థానానికి చేరిందని వ్యాఖ్యానించారు. తాను ఎందుకు రాజీనామా చేయాలని ప్రశ్నించారు. విద్యాశాఖకు మంత్రి లేరని.. తాను రాజీనామా చేయాలని ప్రతిపక్షాల నేతలు అంటున్నారని అన్నారు. విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, లంచ్, స్నాక్స్ పెట్టినందుకు రాజీనామా చేయాలా అని ప్రశ్నించారు. తాను కూడా మెళకువలు నేర్చుకోవడానికి హార్వర్డ్ వెళ్లానని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు.

## అంగన్‌వాడీ వ్యవస్థ మరింత బలోపేతం

ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పనితీరుపై మంత్రి సీతక్క ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సమస్యలను తక్షణమే గుర్తించి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. టీచర్లు, ఆయాలకు అందించే నూతన యూనిఫామ్‌లను పరిశీలించి, అక్టోబర్ మొదటి వారంలోగా వాటిని సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. అలాగే ప్రస్తుతం 17 ఉన్న శిశు దత్తత కేంద్రాలను విస్తరించి ప్రతి జిల్లాలోనూ ఒక అడాప్షన్ సెంటర్ ఉండేలా చూడాలన్నారు.ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి సంబంధించి ఇప్పటికే 16 జిల్లాల్లో నోటిఫికేషన్లు ఇచ్చామని అధికారులు తెలిపారు. మిగతా జిల్లాల్లో కలెక్టర్లతో మాట్లాడి నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. అంగన్‌వాడీల్లో పిల్లలకు అందుతున్న పోషకాహారం, వారి ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించి నివేదిక అందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ నిధులు ల్యాప్స్ కాకుండా పూర్తి స్థాయిలో వినియోగించాలని అధికారులకు నిర్దేశిరచారు. అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. సచివాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖపై మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు జిల్లాల వారీగా అంగన్వాడీ టీచర్లు, ఆయాలతో సదస్సులు నిర్వహించి వారి సూచనలు స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. అలాగే అంగన్వాడీ టీచర్లు, ఆయాల యూనిఫార్మ్‌లను అక్టోబర్ మొదటి వారంలోగా సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో అడాప్షన్ సెంటర్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు వేగవంతం చేయాలని మంత్రి సీతక్క సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 17 అడాప్షన్ సెంటర్లు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాల నియామక ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇప్పటికే 16 జిల్లాల్లో నోటిఫికేషన్లు జారీ కాగా మిగిలిన జిల్లాల్లో కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.

## సోషల్ మీడియాలో ప్రధాని రాజీనామా లేఖ

ఉన్న లేఖ పూర్తిగా ఫేక్. తప్పుడు పత్రాలు, నకిలీ మెసేజ్ల ద్వారా ప్రజల్లో గందరగోళం సృష్టించడం, తప్పుగా ప్రచారం చేయడం, కొన్ని సందర్భాల్లో ఆర్థిక మోసాలకు పాల్పడటం జరుగుతుంది' అని తెలిపింది. వైరల్ పోస్టులను ఆధారంగా చేసుకుని వ్యక్తిగత, ఆర్థిక వివరాలను షేర్ చేసుకోవద్దని, పెట్టుబడుల వంటి నిర్ణయాలు తీసుకోవద్దని పౌరులకు సూచించింది పీఐబీ. అనుమానాస్పద పోస్టులు, నకిలీ పత్రాలు కనిపిస్తే పీఐబీ ఫ్యాక్ట్ చెక్ బృందానికి వాట్సాప్ లేదా ఈ-మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరింది. కృత్రిమ మేధ ఆధారిత నకిలీ కంటెంట్, ఫోర్జరీ పత్రాలు పెరుగుతున్న నేపథ్యంలో ఏ సమాచారాన్నైనా అధికారిక వర్గాలు ధ్రువీకరించాకే నమ్మాలని అధికారులు సూచిస్తున్నారు.

## రాజ్యసభకు చేరిన ప్రశ్నాపత్రాల లీకేజీ నిరోధక బిల్లు

ఆయన బాధ్యత వహించాల్సిందేనని అన్నారు. నీట్ ప్రశ్న పత్రం లీక్, విద్యా వ్యవస్థలో సంస్కరణల కోసం ఆందోళనకు దిగిన వారిపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారని మల్లికార్జున ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులపై బాష్పవాయువు కూడా ప్రయోగించారని తెలిపారు. పోలీసుల తీరుపై కేంద్రం హోం శాఖ మంత్రి అమిత్ షా ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన ప్రశ్నించారు. ఇంతటి దారుణ ఘటనకు అమిత్ షాదే బాధ్యత అని స్పష్టం చేశారు. దీనిపై ఇంతవరకు అమిత్ షా ఎలాంటి ప్రకటన చేయలేదంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఢిల్లీ ఘటనపై నోరు విప్పి మాట్లాడాలంటూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను ఖర్గే డిమాండ్ చేశారు. పేపర్ లీక్ వల్ల విద్యార్థులు నష్టపోవాలా? అని కేంద్రాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. నీట్ పేపర్ లీక్ కారణంగా.. చాలామంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు

గత కొన్ని రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు నదులు, ఉపనదులు పొంగిపొర్లుతున్నాయి. ముఖ్యంగా తెలంగాణ, మహారాష్ట్రల్లోని ఎగువ ప్రాంతాల్లో వర్షాపాతం తీవ్రమవడంతో గోదావరి, ప్రాణహిత నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో రాష్ట్రంలోని పలు కీలకమైన నీటిపారుదల ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో జలాశయాలు సంతరించుకుంటున్న జలకళ రైతుల్లోనూ, ప్రజల్లోనూ తీవ్ర ఆనందాన్ని నింపుతోంది. నిజామాబాద్ జిల్లాలోని ప్రతిష్టాత్మక శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం జలాశయంలోకి 12,900 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, ప్రాజెక్టు నీటి నిల్వ 17.103 టీఎంసీలకు చేరింది. కాకతీయ కాలువ ద్వారా దిగువకు 300 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. అలాగే, నిర్మల్ జిల్లాలోని సారంగాపూర్ మండలంలో ఉన్న స్వర్ణ ప్రాజెక్టుకు ఉదయం వేళకు నీటి సామర్థ్యం అర టీఎంసీ దాటి, ఇన్ ఫ్లో దాదాపు 10 వేల క్యూసెక్కులకు చేరింది. నిర్మల్ జిల్లాకే తలమానికమైన కడెం ప్రాజెక్టుకు వరద నీరు విపరీతంగా పోటెత్తుతోంది. ఉదయం 11:00 గంటల సమయానికి కడెం ప్రాజెక్టుకు ఏకంగా 77,442 క్యూసెక్కుల భారీ ఇన్ ఎ÷-లో నమోదు కాగా, పరిస్థితికి అనుగుణంగా అధికారులు 6 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఇక జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం వద్ద ప్రాణహిత, గోదావరి ఉభయ నదులు పరవళ్లు తొక్కుతూ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అక్కడ నీటిమట్టం 6.320 మీటర్ల ఎత్తులో మెట్ల వద్దకు చేరడంతో తీరం కొత్త రూపు సంతరించుకుంది. గోదావరి జలాలు పోటెత్తడంతో కాళేశ్వరం ప్రాజెక్ట్ లోని మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ కి ఇన్ ఫ్లో భారీగా పెరిగింది. ఎన్డీఎస్ఏ సూచనలను పాటిస్తూ అధికారులు బ్యారేజ్ కి చెందిన మొత్తం 85 గేట్లను ఎత్తి ఉంచారు. ప్రస్తుతం అక్కడ ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో సమంగా 1,01,530 క్యూసెక్కులుగా కొనసాగు తుండటంతో గోదావరి ప్రవాహం దిగువకు వేగంగా పయనిస్తోంది. ప్రాజెక్టుల్లో క్రమంగా నీటి నిల్వలు పెరుగుతుండటంతో నీటిపారుదల శాఖ అధికారులు పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురియ నుండటంతో 9 జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఉమ్మడి కరీంనగర్, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు భారీ వర్షాల నేపథ్యంలో 6 జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. భారీ వర్షాలకు ఉత్తర తెలంగాణతో పాటు నిజామాబాద్ జిల్లాలోని చెరువులు, కుంటలు అలుగుపోస్తున్నాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వర్షాలను దృష్టిలో పెట్టుకొని జగిత్యాల జిల్లాలో పాఠశాలలకు సెలవను ప్రకటించారు. ఈ సీజన్‌లో తొలిసారిగా జూరాల ప్రాజెక్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదలారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితోపాటు,

పరివాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు గోదావరిలో నీటిమట్టం పెరుగుతోంది. గురువారం ఉదయానికి 27 అడుగులకు చేరింది. నీటిమట్టం ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా వర్షాలు దంచికొడుతున్నాయి. భారీ వర్షాలకు కడెం ప్రాజెక్టుకు వరద పోటెత్తున్నది. దీంతో అప్రమత్తమైన ప్రాజెక్టు అధికారులు ప్రాజెక్టు 6 వరద గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఇన్ ఫ్లోగా ప్రాజెక్టులోకి 77,442 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టు 6 వరద గేట్లు 10 ఫీట్లు గేట్లు ఎత్తి అవుట్ ఎ÷-లోగా 67, 000 క్యూసెక్కుల నీటిని దిగవనున్న గోదావరిలోకి అధికారులు వదులుతున్నారు. కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు 3.495 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి మట్టం 693.725 అడుగులు 2.212 టీఎంసీలలో ప్రాజెక్టు నీటి సామర్థ్యం కొనసాగుతుంది. కడెం ప్రాజెక్టు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రవాహ ప్రాంతాలకు ఎవరు కూడా వెళ్లకూడదని ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రవీణ్ కుమార్ సూచించారు. కడెం ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అవసరమైతేనే బయటకు రావాలని అధికారులు కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు మత్తడి పారుతున్నాయి. ఆదిలాబాద్ సహా ఇంద్రవెల్లి, తలమడుగు మండలాల్లో భారీ వర్షం కురుస్తోంది. ఉట్నూరు, నార్నూరు, జైనూరు మండలాల్లో రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి నర్సాపూర్, శాంతాపూర్ వాగులు పొంగాయి. దీంతో ఆయా ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం అంబటిపల్లి గ్రామంలో ఉన్న మేడిగడ్డ బ్యారేజ్‌కి వరద ప్రవాహం పోటెత్తుతుంది. గురువారం బ్యారేజ్ వద్ద 81,060 క్యూసెక్కుల వరద ప్రవాహం రాగా బ్యారేజ్‌లోని 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో వరదనీటిని భారీ నీటిపారుదల శాఖ అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా బ్యారేజీకి వరద ప్రవాహం మరింత పెరుగుతుందని, లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అవసరమైతే తప్ప బయటకు రావొద్దని హెచ్చరించారు. ములుగు జిల్లా వాజేడు మండలం లో కురుస్తున్న భారీ వర్షానికి చీకుపల్లి అటవీప్రాంతంలో ఉన్న తెలంగాణ నయాగర బొగత జలపాతం ఉప్పొంగింది. జలపాతం ముందు ఉన్న సెల్ఫీ వ్యూ పాయింట్‌పై నుంచి స్విమ్మింగ్ పూల్ మీదుగా ఉధృతంగా ప్రవహించింది. దీంతో బొగత సందర్శనకు అటవీశాఖ అధికారులు మధ్యాహ్నం నుంచి అనుమతి నిలిపివేశారు. తాము టికెట్ తీసుకొని లోపలకు వెళ్లగా అనుమతి లేదని బయటకు పంపించారని, టికెట్ డబ్బులు ఇవ్వాలని అడిగినా అధికారుల నుంచి సమాధానం కరువైందని కొందరు పర్యాటకులు ఆరోపించారు. ఈ విషయంపై ఇన్‌చార్జి రేంజ్ అధికారి నరేందర్‌ను అడగగా అలాంటిదేమీ లేదని, జలపాతం వీక్షించిన తర్వాతే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బయటకు పంపించామని తెలిపారు. ఉదయం 6 గంటల వరకు రాష్ట్ర వ్యాప్తంగా నమోదయిన వర్షపాతం వివరాలు ఇలావున్నాయి. వాజేడులో అత్యధికంగా వాజేడులో 16.5 సెం.మీ. ఏటూరునాగారం, 15.2, సర్వాయిపేటలో 14.3, జైపూర్‌లో 14 సెం.మీ, బెజ్జూరులో 14, సెం.మీ., కన్నాయిగూడెంలో 13 సెం.మీ., వెంకటాపురం, 12.6, ముత్తారం, మహదేవ్‌పూర్ లో 12.2 సెం.మీ., నస్పూర్ 11.8 సెం.మీ. ఆసిఫాబాద్‌లో 11.3 సెం.మీ., సింగరేణి(రెబ్బన)లో 11.2 సెం.మీ., కాగజ్‌నగర్, మేడారంలో 10.6 సెం.మీ., సిర్పూర్(టి)లో 10.5 సెం.మీ., కౌతాలంలో 104, కాటారంలో 10.3, నెన్నెలలో 10.3 సెం.మీ. వర్షపాతం నమోదయింది.

## వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు

ఉంటూ పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గురువారం రెవెన్యూ, విపత్తు నిర్వహణ (డిజాస్టర్ మేనేజ్‌మెంట్) అధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో గడచిన రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, రాబోయే రెండు రోజుల్లో కురిసే వర్షాలపై అధికారులకు దిశానిర్ధేశం చేశారు. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. వాగులు, వంకలు, చెరువులు, జలాశయాల వద్ద ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలి. ప్రమాదకర ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేస్తూ, అవసరమైతే వెంటనే సురక్షిత ప్రాంతాలు లేదా పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, విద్యుత్, నీటిపారుదల, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి. ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు ఏర్పడితే తక్షణమే స్పందించి సహాయక చర్యలు అందించాలని సూచించారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా రవాణా, విద్యుత్, తాగునీటి సరఫరాకు ఆటంకం కలగకుండా చూడాలి. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా(హైడ్రా, జీహెచ్ ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల సాధారణ జీవనానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నాలుగు రోజుల క్రితం వరకు రాష్ట్రంలో 30శాతం మేర ఉన్న వర్షపాతం లోటు, గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో భర్తీ అయి దాదాపు సాధారణ స్థాయికి చేరుకుందని మంత్రి తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం గురు, శుక్రవారాల్లో రాష్ట్రంలో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వివిధ జిల్లాలకు అలర్ట్‌లు జారీ అయ్యాయని మంత్రి తెలిపారు. ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశామని అలాగే నిజామాబాద్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశామని తెలిపారు. వచ్చే రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే జిల్లాలపై ప్రధానంగా దృష్టి సారించాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తుగానే చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

## వందేమాతరం గీతానికి పార్లమెంట్ ఆమోదం

అవమానించడం నేరంగా పరిగణించేలా నేషనల్ ఆనర్ యాక్ట్-1971 చట్టంలో మార్పుల కోసం కేంద్రం తాజా బిల్లును తీసుకొచ్చిన విషయం తెలిసిందే. రాజ్యాంగం, జాతీయ జెండా, జాతీయ గీతాన్ని అవమానించిన వారికి ప్రస్తుతం గరిష్ఠంగా మూడేళ్ల వరకూ జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంది. ఇకపై జాతీయ గేయాన్ని అవమానించిన వారికి కూడా ఇదే శిక్ష పడేలా చట్టంలో మార్పులు చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపిన ఈ గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తైన నేపథ్యంలో కేంద్రం ఈ గేయానికి మరిన్ని రక్షణలు కల్పిస్తూ తాజా బిల్లును తీసుకొచ్చింది. బంకిమ్ చంద్ర ఛటర్జీ 1875లో ఈ గేయాన్ని రచించారు. ఆనంద్‌మఠ్ నవలలో భాగంగా తొలిసారి 1882లో ఈ గేయం ప్రచురితమైంది. ఇక ప్రభుత్వ కార్యక్రమాల్లో జాతీయ గేయం ఆలాపనకు సంబంధించి కేంద్రం ఇటీవల రాష్ట్రాలకు నూతన మార్గదర్శకాలను కూడా జారీ చేసింది. రాజ్యసభలో ఈ బిల్లును జులై 24న ప్రవేశపెట్టగా జులై 29న ఆమోదం లభించింది. నేడు లోక్‌సభ కూడా బిల్లుకు ఆమోదం తెలిపింది. నీట్ పేపర్ లీక్ వ్యతిరేకంగా ప్రతిపక్షాల నిరసనల నడుమ రెండు సభల్లోనూ బిల్లుకు ఆమోదం లభించింది.

## కూరగాయల సాగును ప్రోత్సహించండి




హైదరాబాద్,జూలై30: రాష్ట్రంలో కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు వ్యవసాయ శాఖతో కలిసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇందుకు అవసరమైన విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనాన్ని అందించేందుకు కొత్తగా నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ కిచెన్ పరిసర ప్రాంతాల్లో ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. ఆర్గానిక్ పద్ధతిలో కూరగాయలు, ఇతర పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు పండించిన పంటలను నేరుగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ నుంచి ఎక్స్టెన్షన్ అధికారులను నియమించి, సంబంధిత విభాగాల్లో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గురువారం ఎంసీఆర్ హెచ్‌ఆర్డీలోని బోధి పెవిలియన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ఎల్ నినో పరిస్థితుల ప్రభావంపై నిపుణుల కమిటీ నివేదికను సమర్పించింది. నివేదికలో కమిటీ ప్రభుత్వానికి పలు కీలక సూచనలు చేసింది. తెలంగాణలో ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల ప్రభావం, అత్యవసర కార్యాచరణ ప్రణాళికపై నివేదికలో ప్రస్తావించింది. రాష్ట్రంలో తగినంత వర్షపాతం నమోదు కాకపోవడంతో వ్యవసాయంపై తీవ్ర ప్రభావం పడిందని తెలిపింది. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని పేర్కొంది. గ్రామాలవారీగా అత్యవసర ప్రణాళికలు రూపొందించి పప్పు ధాన్యాలు, నూనె గింజలు, చిరు ధాన్యాలు, కూరగాయల పంటలను ప్రోత్సహించాలని తెలిపింది. 75శాతం సబ్సిడీతో ఈ పంటలకు సంబంధించిన విత్తనాలను అందించాలని, ప్రత్యామ్నాయ పంటలకు కొత్త రుణాలు మంజూరు చేయాలని కమిటీ సూచించింది. గత ఏడాది ఈ సీజన్ లో 79.49 లక్షల ఎకరాలు సాగవగా, ఈ ఏడాది 74.56 లక్షల ఎకరాలు మాత్రమే సాగయ్యాయని పేర్కొంది. పత్తి పంట 45 లక్షల ఎకరాలు, సోయాబీన్ 3.62 లక్షల ఎకరాలు, వరి 14.92 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన పంటల సాగు ఉందని నివేదికలో తెలిపింది. ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో 75 నుంచి 90శాతం సబ్సిడీ అందించి డ్రిప్, స్పిం÷-రక్లర్ సాగు పద్ధతులను ప్రోత్సహించాలని సూచించింది. పశుగ్రాస విత్తనాలు సబ్సిడీపై అందించి? పశు గ్రాస సాగును ప్రోత్సహించాలని, సాగునీటి కోసం నిరంతర విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని తెలిపింది. వ్యవసాయ విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తల ద్వారా రైతులకు సాంకేతిక సూచనలు అందించాలంది. హైదరాబాద్ పరిసర గ్రామాల్లో కూరగాయల సాగును ప్రోత్సహిస్తూ రైతు బజార్లకు రవాణా సౌకర్యం కల్పించాలని నివేదికలో పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో డైరీ యూనిట్లను స్థాపించేందుకు ఆర్థిక సహాయం అందించాలని, అత్యవసర చర్యల అమలును పర్యవేక్షిం చేందుకు గ్రామస్థాయి బృందాలను ఏర్పాటు చేయాలని తెలిపింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి, నిపుణుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, సాగునీరు, గ్రామీణాభివృద్ధి తదితర రంగాలను పరిరక్షించేందుకు రూపొందించిన రాష్ట్ర స్థాయి సమగ్ర కార్యాచరణ నివేదికను నిపుణుల కమిటీ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి గురువారం ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి బోధి సెంటర్ లో అందజేశారు.

## అభివృద్ధిని చూసి ఓర్వలేకే దుష్ప్రచారం: సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి/ జూలై 30/ అక్షరం న్యూస్:
ములకలపల్లి పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక కొందరు కావాలనే అసత్య ప్రచారాలు చేస్తున్నారని ముకమామిడి సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి మండిపడ్డారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. మొగరాలగుప్ప గ్రామంలో 2015-16లో వేసిన సీసీ రోడ్డు గత ఎనిమిదేళ్లుగా గుంతలమయమై, మురుగునీరు నిలిచి దుర్వాసన వెద జల్లుతోందని తెలిపారు. ఈ సమస్యను స్థానిక వార్డు సభ్యురాలు తానం పావని పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లగా, ఎమ్మెల్యే జారేఆదినారాయణతో మాట్లాడటం జరిగిందన్నారు. త్వరలోనే డ్రెయినేజీ నిర్మిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని, ఈలోగా మురుగు సమస్య తగ్గించేందుకు ప్రజల కోరిక మేరకు తాత్కాలికంగా మట్టి వేయించడం జరిగిందని స్పష్టం చేశారు. బాగున్న రోడ్డుపై ఎవరూ మట్టి పోయలేదని, ఇటీవల కురిసిన వర్షాలకు ఆ మట్టి బురదగా మారిందని వివరించారు. ఎమ్మెల్యే అనుచరులమని చెప్పుకుంటూ కొందరు మీడియాను తప్పుదోవ పట్టిస్తూ ప్రజాధనం దుర్వినియోగమైందని అసత్య వార్తలు రాయిస్తున్నారని, వీటిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్ల పాడుచేయలేదని తెలిపారు. పంచాయతీలో నిధుల కొరత ఉందని, నిధులు రాగానే ఎమ్మెల్యే సహకారంతో మిగిలిన అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని చెప్పారు. పంచాయతీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి కోరారు.

## శంకర్‌పల్లి మున్సిపల్ ఒకటో వార్డులో మురుగునీటి సమస్య తీవ్రం..

- స్పందించాలని ప్రజాప్రతినిధులకు కాలనీవాసుల విజ్ఞప్తి.



రంగారెడ్డి జిల్లా :శంకర్పల్లి :జులై 30: అక్షరం న్యూస్ : శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డు వెంకటేశ్వర కాలనీలో పారిశుద్ధ్య సమస్యలు తీవ్రరూపం దాల్చాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలోని క్రిస్టల్ వెంచర్ ప్రాంతంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ దుర్వాసన వెదజల్లుతోందని తెలిపారు. రోడ్లపై పారుతున్న మురుగునీరు కొన్ని ఇళ్లలోకి చేరుతుండటంతో వృద్ధులు, చిన్నారులు అనారోగ్య సమస్యలకు గురయ్యే పరిస్థితి ఏర్పడిందని వారు పేర్కొన్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమస్యను తెలియజేసినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం లభించలేదని వాపోయారు. ప్రజా సమస్యల పరిష్కారంపై తగిన చర్యలు తీసుకోవాలని పలుమార్లు కోరినా ఆశించిన స్థాయిలో స్పందన లేదని కాలనీవాసులు తెలిపారు. వెంటనే మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించి కాలనీవాసులకు ఉపశమనం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## వీరన్న హుండీ ఆదాయం రూ.6.58 లక్షలు



హనుమకొండ జిల్లా/ భీమదేవరపల్లి/జూలై 30/అక్షరం న్యూస్:-
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలోని శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో గురువారం హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ సందర్భంగా హుండీలో మొత్తం రూ. 6,58,502 ఆదాయం లభించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి పి. కిషన్‌రావు తెలిపారు. హుండీ లెక్కింపులో నోట్ల రూపంలో రూ. 6,04,032, నాణేల రూపంలో రూ. 54,470 లభించాయి. అదనంగా 8 గ్రాముల మిశ్రమ బంగారం, 660 గ్రాముల మిశ్రమ వెండి, 11 విదేశీ కరెన్సీ నోట్లు కూడా భక్తులు సమర్పించినట్లు వెల్లడించారు. హుండీ ద్వారా వచ్చిన నగదు మొత్తాన్ని యూనియన్ బ్యాంకులో జమ చేసినట్లు తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో హనుమకొండ జిల్లా పరిశీలకులు ఎస్. నందనం కవిత, గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, భక్తులు, శ్రీ భద్రకాళి సేవా సమితి, శ్రీ రాజరాజేశ్వర సేవా సమితి సభ్యులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సనాతన ధర్మాన్ని విశ్వ వ్యాపితం చేసిన అధిశంకర చార్యులను, శివాజిని, ప్రతి హిందువు ఆదర్శంగా తీసుకోవాలి..





- పురాతన ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్న నరేష్ కుమార్ సేవలు భేష్.
- శ్రీ అన్న వజ్జుల సూర్య ప్రకాష్ రావ్.

రంగారెడ్డి జిల్లా :శంకర్పల్లి :జూలై 30: అక్షరం న్యూస్ -:

:సనాతన ధర్మాన్ని విశ్వవ్యాపితం చేసిన జగద్గురు ఆదిశంకర చార్లను హిందూ హైందవ జాతి చైతన్యం కోసం ప్రాణాలను కూడా లెక్కచేయని చత్రపతి శివాజీ లను ప్రతి భారతీయుడు ఆదర్శంగా తీసుకొని ఎదగాలని తెలంగాణ ఎండోమెంట్ సెల్ ధార్మిక స్టేట్ కన్వీనర్ శ్రీ అన్నవజ్జుల సూర్యప్రకాష్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం వ్యాస పూర్ణిమ గురిపౌర్ణిమ సందర్భంగా నవపేట్ మండలం గుబ్బడి పత్యపురంలోని శ్రీ రాధాకృష్ణ ఆలయ క్షేత్రం శ్రీ క్రిష్ణగిరి పాదాలగుట్టను ఆయన సందర్శించి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతన ఆలయాలు అభివృద్ధి సనాతన చరిత్రల అభివృద్ధి కోసం శ్రమించి చెందిప్ప మరకత శివలింగ నామకరణ భక్తుడు ఆలయ పున నిర్మాణ స్వీకారకుడు కోటి దీపోత్సవ రాష్ట్రస్థాయి ధర్మకర్త అవార్డు గ్రహీత శంకర్పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షులు ఆర్ నరేష్ కుమార్ (సతీష్ కుమార్ )సేవలు అభినందనీయమన్నారు. నేటి యువతరం నరేష్ కుమార్ ను ఆదర్శంగా తీసుకొని తమ తమ గ్రామాలలో ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయాలన్నారు. స్టేట్ కో కన్వీనర్ శ్రీ నిరంజన్ దేశాయ్ మాట్లాడుతూ తాను మా ధార్మిక సంస్థలో రంగారెడ్డి జిల్లా రూరల్ జాయింట్ కన్వీనర్ గా ఉన్న నరేష్ కుమార్ సతీష్ కుమార్ ఇలాంటి మారుమూల గ్రామాల్లో దేశభక్తిని దైవభక్తిని పెంపొందించడం తమ సంస్థకే గర్వకారణమని కొనియాడారు. ప్రతి హిందూ ప్రతి శనివారం తప్పకుండా గుడికెళ్లి పూజలు చేయాలని నరేష్ కు మీరంతా సహకరిస్తే మీ గ్రామానికి మరింత పేరు ప్రఖ్యాతలు లభిస్తాయి అని సూచించారు. స్టేట్ కార్యవర్గ సభ్యులు మణిదీప్, జిల్లా కో కన్వీనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ ఈ గుబ్బడి పత్తి పురంలోని క్రిష్ణగిరి పాదాల గుట్ట ఎంతో మహిమగలదని ఇలాంటి ప్రాంతానికి పిలిపించిన నరేష్ కుమార్ కి గ్రామస్తులకు కృతజ్ఞతలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయాలని తాము కూడా ఇలాంటి ఆలయాల నిర్మాణాలకు అండగా ఉంటామని తెలిపారు. రంగారెడ్డి జిల్లా రూరల్ కన్వీనర్ నర్సింగ్ రావ్, భాజపా ఎండోమెంట్ సెల్ ధార్మిక జాయింట్ కన్వీనర్ ఆర్ నరేష్ కుమార్ సతీష్ కుమార్ మాట్లాడుతూ పుట్టిన ఊరును జన్మనిచ్చిన తల్లిదండ్రులను మర్చిపోవద్దని శ్రీరామచంద్రుడు అన్నాడు కాబట్టి ప్రతి ఒక్కరూ రాముని సందేశాన్ని ఆదర్శంగా తీసుకుంటే ప్రతి గ్రామం ఓ రామ రాజ్యం అవుతుందని తెలిపారు... గురు పూర్ణిమ గురు పూజత్సవమును పురస్కరించుకొని అంతప్ప గూడ గ్రామం లోని శ్రీ శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున బ్రహ్మానంద ఆశ్రమ పిఠాధిపతి ఏ. నర్సింహా గౌడ్ గారిని, సూర్య ప్రకాష్ రావ్ గారు శాలువాతో సత్కరించి గురువందనం గౌరవాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రావులపల్లి రామ లక్ష్మయ్య భూపతిరెడ్డి, ముదిరాజ్ జంగయ్య, ఆర్ రాజు, రాములు గౌడ్, వేనేంద్ర చారి, కార్తీక్, పోచయ్య, తదితరులను స్టేట్ కమిటీ అభినందించి శాలువాక్ అప్పడం జరిగింది. స్టేట్ జాయింట్ కన్వీనర్ ఎస్ విజయ శ్రీ చౌదరి గుడి అభివృద్ధికి ఐదువేలను విజయేందర్ సింగ్ 10000 అందించడం జరిగింది. అనంతరం నరేష్ కుమార్ స్టేట్ కమిటీ అన్న వజ్జుల సూర్యప్రకాష్ని, నిరంజన్ దేశాయ్ ని, విజయ్ శ్రీ చౌదరి ని, అండెం నర్సిరెడ్డి ని, ముత్యాల అనిల్ కుమార్ ని, హనుమకొండ శైలజ ని, శంకర్ చారిని, జిల్లా జాయింట్ కన్వీనర్ ఎన్.రమేష్ ని, జిల్లా జాయింట్ కన్వీనర్ డి భాస్కర్ గౌడ్, ని జిల్లా కో కన్వీనర్ కొంగూరి కిరణ్ ని, వైబావ్, నర్సింహా రెడ్డి తదితర కార్యవర్గ సభ్యులందరికీ సన్మానించి తీర్థ ప్రసాదలను అందించడం జరిగింది . అనంతరం వచ్చిన భక్తులందరికీ అన్న వితరణ అన్న ప్రసాద వితరణ జరిగింది. పచ్చని పంట పొలాలు చల్లని చిరుజల్లులతో కూడిన గాలులో పల్లెటూరి వాతావరణం మనసులను ఆనందపరిచిందని వచ్చిన భక్తులందరూ పులకించి పోవడం జరిగింది.

## భారీ వర్షాల నేపథ్యంలో రామగుండం పాత బజారులో పరిస్థితులను పరిశీలించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్






జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్
: రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో రామగుండం నియోజకవర్గంలోని పాత బజారు ప్రాంతంలో ఏర్పడిన పరిస్థితులను రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అడిషనల్ కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు. వర్షపు నీరు నిలిచిన ప్రాంతాలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా పరిశీలించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సహాయక చర్యలు వెంటనే చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరం అయితే తప్ప వరద ప్రభావిత ప్రాంతాల్లో సంచరించవద్దని విజ్ఞప్తి చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అధికారుల సూచనలు పాటించాలని, ఏవైనా సమస్యలు తలెత్తిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల భద్రతే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే వెంట రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి, ఏసీపీ రమేష్ కార్పోరేటర్లు, నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ ఉద్యమకారుల హక్కుల కోసం రాష్ట్రవ్యాప్తంగా ఐక్యత అవసరం: తోడేటి శంకర్ గౌడ్



జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్
తెలంగాణ ఉద్యమకారుల అభిప్రాయాలను గౌరవిస్తూ తెలంగాణ ఉద్యమకారుల సమితి ముందుకు సాగుతుందని సమితి అధ్యక్షులు తోడేటి శంకర్ గౌడ్ తెలిపారు. గురువారం ఎన్‌టీపీసీ పరిధిలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో తెలంగాణ ఉద్యమకారుల సమితి తొలి సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల హక్కుల సాధన కోసం చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణపై సభ్యుల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారుల హక్కుల కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యమకారుల సంఘాలు ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యమకారుల సమస్యలపై ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసినప్పటికీ, ఆ కమిటీ ద్వారా కాలయాపన జరుగుతోందని ఆయన విమర్శించారు. హక్కుల సాధన కోసం ఉద్యమకారులందరూ ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. వర్షం కారణంగా పలువురు ఉద్యమకారులు సమావేశానికి హాజరుకాలేకపోయారని, వర్షాలు తగ్గిన అనంతరం మరో విస్తృత సమావేశాన్ని నిర్వహిస్తామని తెలిపారు. చిలుక శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నగునూరి రాజయ్య గౌడ్, దాసరి ఎల్లయ్య, ఈదునూరి పర్వతాలు, ఈదునూరి శంకర్, వీరలాల్, కె.వి. చందు, వోల్లాల మల్లేశం, కంది నాగరాజు, ఈదునూరి పద్మ, జిన్నా రమ, నగునూరి తిరుపతి, పొన్నం విజయ్ గౌడ్, కొంద్ర మొగిలి, అనుముల కళావతి తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో రామగుండం నియోజకవర్గ ఇన్చార్జిగా నూతి తిరుపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీ గౌరవ అధ్యక్షులుగా నగునూరి రాజయ్య గౌడ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గా ఈదునూరి పర్వతాలు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చిలుక శంకర్ రామగుండం నియోజకవర్గ ఇన్చార్జిగా నూతి తిరుపతి నీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## గోదావరిఖని పీజీ కళాశాల ఎంసీఏ ప్రవేశాల హెల్ప్ లైన్ ఏర్పాటు




జ్యోతి నగర్ ఎన్టిపి సి జూలై 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

స్థానిక యూనివర్సిటీ పీజీ కళాశాల గోదావరిఖనిలో ఎంబీఏ ఎంసీఏ ప్రవేశాలకు సంబంధించిన ఐసెట్ హెల్ప్ లైన్ సెంటర్ ని ఏర్పాటు చేసినట్లుగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇనుగాల మనోహర్ తెలిపారు ఈ హెల్ప్ లైన్ సెంటర్ ద్వారా ఆగస్టు మూడు నుండి ఐదు వరకు నిర్వహించే ఐసెట్ మొదటి విడత సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరగనున్నట్లుగా ప్రిన్సిపల్ తెలిపారు ఈనెల 31 నుండి స్లాట్ బుక్ చేసుకొని విద్యార్థులు కౌన్సిలింగ్ హాజరు కావాలని తెలిపారు ఈ అవకాశాన్ని గోదావరిఖని పారిశ్రామిక ప్రాంత విద్యార్థులు ఉపయోగించుకోవాలని సూచించారు పీజీ కళాశాలలో ఇదివరకు ఇంజనీరింగ్ మరియు డిప్లమా కోర్సుల యొక్క కౌన్సిలింగ్ నిర్వహించారు కాగా ఈ సంవత్సరం నుండి టీజీ ఐసెట్ కౌన్సిలింగ్ అందుబాటులోకి రానున్నది

## ఎన్టీపీసీ కృష్ణానగర్‌లో ఘనంగా సత్సంగం నిర్వహణ



జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూలై 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: జగదాచార్యులు త్రిదండి చిన్న రామానుజ జీయర్ స్వామి వారి 70వ తిరునక్షత్రం 'యతీంద్ర సప్తతి' ఉత్సవాల సందర్భంగా అహోబిల జీయర్ స్వామి సూచనల మేరకు 'శ్రీరాముని మదిలో నింపండి -- శ్రీరాముని మదిలో చేరండి' అనే కార్యక్రమంలో భాగంగా వికాసతరంగిణి ఆధ్వర్యంలో ఇంటింటా సత్సంగ కార్యక్రమాన్ని గురువారం ఎన్టీపీసీ కృష్ణానగర్‌లో నిర్వహించారు. కృష్ణానగర్‌లోని రాసమడుగు కవిత--రఘుపతిరావు నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు సామూహికంగా శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రం పారాయణం చేశారు. అనంతరం దాటీపంచకం, యతిరాజ వింశతి పారాయణాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని జీయర్ స్వామి వారి యతీంద్ర సప్తతి తిరునక్షత్ర ఉత్సవాలను ఘనంగా నిర్వహించి గురుకానుకను సమర్పించుకున్నారు. కార్యక్రమాన్ని ఎన్టీపీసీ వికాసతరంగిణి శాఖ సభ్యులు సమన్వయం చేశారు.

## ఏడుబావుల జలపాతం హెచ్చరిక



మహబూబాబాద్ జిల్లా /గంగారం/ జులై 30 (అక్షరం న్యూస్) గంగారం మండలంలోని ఏడు బావులు జలపాతం ఇటీవల కురిసిన వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తున్నందున, గతంలో జరిగిన ప్రాణ నష్టాన్ని దృష్టిలో ఉంచుకొని జలపాతం వద్ద ఏర్పాటుచేసిన భద్రత చర్యలను ఈరోజు మహబూబాబాద్ డిఎస్పి తిరుపతి రావు మరియు గూడూరు సీఐ వినయ్ కుమార్ పర్యవేక్షించడం జరిగింది ఈ సందర్భంగా సందర్శకులు ఎవరు కూడా జలపాతం వద్దకు రావద్దని డిఎస్పి తిరుపతి రావు తెలియజేయడం జరిగింది. ఈ మేరకు అటవీశాఖ మరియు పోలీస్ శాఖ సిబ్బంది తో గంగారం ఎస్సై కోటేశ్వరరావు గారి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది. జలపాతం సందర్శనకు అనుమతి లేదని, నిబంధనలు అతిక్రమించిన వారికి పై చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలియజేయడం జరిగింది.




# దాసరి మనోహర్ రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు తగవుబీఆర్ఎస్ నాయకులు





పెద్దపల్లి జులై 30అక్షరం న్యూస్

మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పై వ్యక్తిగత విమర్శలు తగవని వీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు ఈ సందర్భంగా స్థానిక జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ మాట్లాడుతూ స్థానిక మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పై వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని నియోజకవర్గంలోని రైతుల సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ ఎదుట పెద్దపెల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ధర్నా నిర్వహిస్తే మింగుడుపడని కాంగ్రెస్ నాయకులు ఆయనపై వ్యక్తిగత దూషణలు చేయడం సరికాదని బిఆర్ఎస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు రైతుల కోసం సాగునీరు అందేలా చూడాలని, అంతరాయాలు లేకుండా నాణ్యమైన కరెంటు సరఫరా చేయాలని, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉంచి అధిక ధరలకు విక్రయించకుండా నియంత్రించాలని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తే ఆయనపై అసత్యపచారాలు చేయడం సిగ్గుచేటు అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను కపిపుచ్చుకొని రైతులకు సమాధానం చెప్పలేక సంబంధం లేని ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు.

రైతుల సమస్యలను ప్రస్తావిస్తే రాజకీయ కోణంలో చూడటం సరైన విధానం కాదన్నారు. మనోహర్ రెడ్డి ఎమ్మెల్యేగా పదేళ్లలో 24గంటలపాటు నాణ్యమైన విద్యుత్తును అందించారని, సకాలంలో ఎరువులను అందుబాటులో ఉంచారని, రైతులు పంట ఉత్పత్తులను తమ గ్రామం లోనే విక్రయించుకునేలా గ్రామ గ్రామాన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారని తెలిపారు. రైతులకు రైతు పెట్టుబడి సహాయం, రైతు బీమా సకాలంలో అందించాడన్నారు. రైతు సంక్షేమాన్ని విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే స్థానిక ఎమ్మెల్యే అనుచరులు జీర్ణించుకోలేక తప్పుడు ఆరోపణలు చేయడం అవివేకం అన్నారు. అలాగే బిఆర్ఎస్ పార్టీ ధర్నాకు అనూహ్యమైన

స్పందన లభించడాన్ని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. మనోహర్ రెడ్డి అధికారంలో ఉన్నాను రోజులు ఇప్పటి కాంగ్రెస్ నాయకులు ఆయన వెంట ఉండి పదవులు అనుభవించిన విషయాన్ని మర్చిపోవద్దని సూచించారు. దాసరి మనోహర్ రెడ్డిని విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదని పేర్కొన్నారు.

బిఆర్ఎస్ పార్టీలో అంతర్గత విభేదాలు ఉన్నాయని చేస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో పెద్దపల్లి నియోజకవర్గ టికెట్ దాసరి మనోహర్ రెడ్డికేనని, ఆయన మళ్లీ ఎమ్మెల్యేగా విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో తిరిగి బిఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలను పక్కనబెట్టి బిఆర్ఎస్‌పై విమర్శలు చేయడం మానుకోవాలని సూచించిచారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి వంగల తిరుపతిరెడ్డి,

మాజీ ఎంపీపీ నూనెటి సంపత్ యాదవ్, మోహన్ రావు, మండల అధ్యక్షులు మార్కు లక్ష్మణ్, బైరం రామ్ రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ సందీప్ రావు, కౌన్సిలర్ వెన్నం సుజాత రవీందర్, నాయకులు గుణపతి,మోబిన్ ,దయాకర్, పెంచల శ్రీధర్, పూదరి చంద్రశేఖర్, కొయ్యడ అరుణ్, సంపత్, బాబు రావు, కాశిపాక వాసు, ముఖీమ్, సదయ్య, రఫీక్, పల్లె మధు, కుక్క మనోజ్, తిరుపతి రెడ్డి, సతీష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు

### పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ

### అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్-100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించండి



జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కమిషనరేట్ పరిధిలోని ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పెద్దపల్లి,మంచిర్యాల జోన్లలోని పోలీసు యంత్రాంగం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎవరైనా ఆపదలో చిక్కుకున్నట్లయితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100కు సమాచారం అందించి పోలీసుల సహాయం పొందవచ్చని సూచించారు. అధికారులు జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు

పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని సూచించారు.

ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని కమిషనరేట్ పరిధిలోని డ్యామ్‌లు, పర్యాటక ప్రాంతాలను తాత్కాలికంగా మూసివేయడం జరిగిందని,సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు ఎవరూ అక్కడికి వెళ్లరాదని సూచించారు.

ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా పోలీసు శాఖ తరఫున అన్ని ముందస్తు భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు పోలీసుల సూచనలు, సలహాలను పాటిస్తూ సహకరించాలని, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు,కాలువలు, నదులు, రిజర్వాయర్లు, చెరువుల వద్దకు వెళ్ల రాదు.

చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో లేదా పాడైన నిర్మాణాల వద్ద ఆశ్రయం పొందరాదు. విద్యుత్ స్థంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు తాకరాదు.

ఎట్టి పరిస్థితుల్లోనూ చెరువులు,నాలాలు, డ్యామ్‌లు, జలపాతాలు (వాటర్ ఫాల్స్) వద్దకు వెళ్లరాదు. చేపల వేట కోసం కూడా వెళ్లకూడదు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఇంటి నుంచి బయటకు రావాలి.

స్థానిక రెవెన్యూ, నీటిపారుదల, పంచాయతీరాజ్, విద్యుత్,ఆర్అండ్‌బీ, వైద్య శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ,వరదల కారణంగా రహదారులు దెబ్బతిన్న లేదా నీట మునిగిన ప్రాంతాల్లో ప్రజలు వెళ్లకుండా ఇరువైపులా బ్యారికేడ్లు,ప్లాస్టిక్ కోన్‌లు,హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని చెరువులు, కుంటలు,అలుగులు, ప్రధానరహదారులపై ప్రవహిస్తున్న వాగులు, వంకల వద్ద నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పోలీసు అధికారులు,సిబ్బంది అన్ని జాగ్రత్త చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

వరద నీటి కారణంగా చెరువులు, కుంటలు నిండి కట్టలు తెగిపోయే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వాహనదారులు అత్యంత జాగ్రత్తగా ప్రయాణించాలి. వర్షాల కారణంగా రహదారులు దెబ్బతినడం, గుంతలు ఏర్పడి వాటిలో నీరు నిల్వ ఉండడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. కాబట్టి నెమ్మదిగా, అప్రమత్తంగా ప్రయాణించాలని సూచించారు.

కల్వర్టులు,చిన్న వంతెనలపై నీరు ప్రవహిస్తున్న సమయంలో వాహనాలతో వాటిని దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించరాదని హెచ్చరించారు.

ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు, కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక శిక్షణ పొందిన 30 మంది సిబ్బంది అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్-100కు సమాచారం అందించాలని, పోలీసు సిబ్బంది 24 గంటల పాటు సహాయక చర్యలకు సిద్ధంగా ఉంటారని పోలీస్ కమిషనర్ తెలిపారు.

# అవకాడోతో అభయం



మన గుండెకు అవకాడో అభయం ఇస్తుంది. శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంతోపాటు గుండె, రక్తనాళాల ఆరోగ్యాన్నీ కాపాడుతుంది. అమెరికాకు చెందిన జర్నల్ ఆఫ్ క్లినికల్ లిపిడాలజీ తాజాగా నిర్వహించిన ఓ పరిశోధన.. ఈ విషయాన్ని తేల్చింది. ప్రస్తుతం చెడు కొలెస్ట్రాల్ సమస్య చాలామందిని వేధిస్తున్నది. ఎలాంటి ఆహార నియమాలు పాటించినా, ఎన్ని మందులు వాడినా.. ప్రాణాలకు మీదికి తెస్తున్నది. అయితే, రోజుకు ఒకేఒక్క అవకాడో తింటే.. గుండె పదిలంగా ఉంటుందని జర్నల్ ఆఫ్ క్లినికల్ లిపిడాలజీ అధ్యయనం వెల్లడించింది.

ఈ అధ్యయనం కోసం అధిక బరువు, చెడు కొలెస్ట్రాల్‌తో బాధపడుతున్న కొందరిని ఎంపిక చేశారు. వారిని రెండు బృందాలుగా విభజించి.. కొందరికి రోజూ తినే ఆహారంతోపాటు ఒక అవకాడో పండును అందించారు. రెండో గ్రూప్ వాళ్లకు మాములు ఆహారం పెట్టారు. ఆరు నెలల తర్వాత వాళ్లందరికీ రక్త పరీక్షలు నిర్వహించారు. ఇందులో రోజూ ఒక అవకాడో తిన్న వారి రక్తంలో చెడు కొలెస్ట్రాల్‌తోపాటు గుండె జబ్బుల ప్రమాదం దాదాపు 4 శాతం వరకు తగ్గినట్టు పరిశోధకులు గుర్తించారు. ఇందుకు గల కారణాలను వివరిస్తూ.. అవకాడోలో మన శరీరానికి మేలుచేసే మోనోఅన్‌శాచురేటెడ్ ఫ్యాట్ చాలా ఎక్కువగా ఉంటుంది.

ఈ సహజమైన కొవ్వు.. మన శరీరంలో పేరుకుపోయిన చెడు కొవ్వును బయటికి పంపడంలో సమర్థంగా పనిచేస్తుంది. ఇందులోని ఫైబర్.. మనం తినే ఆహారంలోని ఫ్యాట్‌ను పొట్ట, పేగులు పీల్చుకోకుండా అడ్డుకుంటుందని పరిశోధకులు చెబుతున్నారు. అవకాడాలో ఉండే పొటాషియం బీపీని అదుపులో ఉంచుతుందనీ, విటమిన్ ఇ, యాంటీ ఆక్సిడెంట్లు రక్తనాళాలు దెబ్బతినకుండా కాపాడతాయని వివరిస్తున్నారు. అందుకే.. రోజువారీ ఆహారంలో అవకాడోను చేర్చుకోవడం వల్ల గుండెకు కొండంత రక్షణ లభిస్తుందని అంటున్నారు. అయితే, గుండెకు అవకాడో ఎంత మేలు చేసినప్పటికీ.. ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటిస్తేనే గుండెకు పూర్తి రక్షణ లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

## తప్పిపోయిన మైనర్ బాలికలను గుర్తించిన పోలీసులు



పెద్దపల్లి జిల్లా / సుల్తానాబాద్ / జూలై 30 / అక్షరం న్యూస్.

సుల్తానాబాద్ పట్టణంలోని మార్కండేయ కాలనీలోని బాలసదన్ చిల్డ్రన్ హోమ్ నుండి బుధవారం ఇద్దరు మైనర్ బాలికలు కాంపౌండ్ గోడ దూకి వెళ్లిపోయిన విషయం తెలియగానే, పెద్దపల్లి డీ.సీ.పీ శ్రీ రామ్ రెడ్డి, ఐ. పి. ఎస్ ఆదేశాల మేరకు వెంటనే ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ మేరకు నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి, విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలు, ప్రయాణ మార్గాలతో పాటు ఇతర సమాచారాన్ని విశ్లేషించగా, బాలికలు సుల్తానాబాద్ నుంచి నల్గొండకు వెళ్లినట్లు గుర్తించి నల్గొండ బస్టాండులో ఇద్దరు బాలికలను సురక్షితంగా గుర్తించి రక్షించారు. అనంతరం వారిని భద్రంగా తీసుకువచ్చి సంబంధిత అధికారులకు చట్టపరమైన విధానంలో అప్పగించారు. ఈ ఆపరేషన్‌లో సుల్తానాబాద్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పొన్నమనేని రంజిత్ రావు, సుల్తానాబాద్ ఎస్. హెచ్. ఓ చంద్రకుమార్, హెడ్ కానిస్టేబుళ్లు మహేందర్, కానిస్టేబుళ్లు వెంకటేష్, రవి, రమేష్, అరుణ్, సదానందం రేణుక అలాగే టెక్నికల్ టీమ్ సభ్యులు సమన్వయంతో పనిచేసి బాలికలను వేగంగా గుర్తించి రక్షించడంలో కీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా డీసీపీ శ్రీ రామ్ రెడ్డి,ఐ. పి. ఎస్. ఆపరేషన్‌లో పాల్గొన్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పొన్నమనేని రంజిత్ రావు, ఎస్‌హెచ్ఓ శ్రీ చంద్రకుమార్, పోలీసు సిబ్బందితో పాటు టెక్నికల్ టీమ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. వారి సమన్వయం, అప్రమత్తత, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించడం వల్లే తక్కువ సమయంలో బాలికలను సురక్షితంగా గుర్తించడం సాధ్యమైందని ఆయన వివరించారు. ఇంత వేగంగా స్పందించి మైనర్ బాలికలను సురక్షితంగా గుర్తించి రక్షించినందుకు సుల్తానాబాద్ మండల ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ విభాగం ప్రతినిధులతో పాటు స్థానిక ప్రజలు పోలీసు శాఖను అభినందించారు. చిన్నారుల రక్షణ విషయంలో పోలీసులు చూపిన అంకితభావం, వేగవంతమైన చర్యలు ప్రశంసనీయమని వారు కొనియాడారు.

## మానవత్వం పరిమళించిన వేళ..

- కూలిపోయే స్థితిలోని ఇంట్లో బిక్కుబిక్కుమంటూ వృద్ధ దంపతులు.
- ప్రభుత్వ వృద్ధాశ్రమానికి తరలింపు.



పెద్దపల్లి జిల్లా / సుల్తానాబాద్ / జూలై 30 / అక్షరం న్యూస్

కన్న కడుపు తీపి కరిగిపోయింది,రక్త బంధం ముల్లై గుచ్చుకుంది. జీవిత చరమాంకంలో రెక్కలొచ్చిన పిల్లలు కంటికి రెప్పలా చూసుకుంటారనుకుంటే, కన్నవారినే కంటిపాపలా కాపాడాల్సిన చేతులే ఆ వృద్ధులను దిక్కులేనివారిగా నిలబెట్టాయి. సుల్తానాబాద్‌కు చెందిన కలవాల లక్ష్మి- రాజయ్య దంపతుల దీనగాథ చూసిన ప్రతి ఒక్కరి గుండె పిండేస్తుంది. కష్టపడి పెంచి పెద్ద చేసిన కొడుకులే ఆదరణ చూపక, ముఖం చాటేయడంతో, ఆ వృద్ధ దంపతులు అనుభవిస్తున్న మనోవేదన వర్ణనాతీతం. దానికితోడు ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు ఆ అభాగ్యుల పాలిట శాపంగా మారాయి. వారు నివసిస్తున్న ఇల్లు పూర్తిగా శిథిలమై, ఏ క్షణాన కూలి నెత్తి మీద పడుతుందో తెలియక, బిక్కుబిక్కుమంటూ, చలికి వణుకుతూ ఆ దంపతులు బతుకీడుస్తున్న తీరు కంటినీరు తెప్పించేలా ఉంది. కన్నవారే కన్నీరు పెట్టిస్తున్న ఈ గుండెకోతను చూసి స్థానిక మున్సిపల్ చైర్మన్ బిరుదు కృష్ణ, వార్డు కౌన్సిలర్లు గాజుల రాజమల్లు, వర ప్రదీప్, పద్మ అబ్బయ్య గౌడ్, శంకరమ్మ ఓదెలు, యువ నాయకులు గాజుల హరీష్ ల మనస్సులు తీవ్రంగా చలించిపోయాయి. ఈ వయసులో వీరికి ఈ గతి ఏంటని తల్లడిల్లిపోయిన ఆ నాయకులు క్షణం కూడా ఆలస్యం చేయకుండా వారిని ఆదుకునేందుకు నడుం బిగించారు. సొంత బిడ్డలే కాదనుకుని గాలికి వదిలేసిన ఈ స్థానిక నాయకులు ఆ వృద్ధ దంపతులకు కన్నపిల్లల కంటే మిన్నగా అండగా నిలిచారు. మేమున్నామని ధైర్యం చెప్తూ, ప్రేమతో వారిని సురక్షితంగా ప్రభుత్వ వృద్ధాశ్రమానికి తరలించి, వారికి కావాల్సిన సకల వసతులను దగ్గరుండి ఏర్పాటు చేశారు. స్వార్థం నిండిన ఈ సమాజంలో , ఆపదలో ఉన్న వృద్ధులకు నిజమైన బిడ్డల్లా మారి అక్కున చేర్చుకున్న మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు ,నాయకుల మానవతా దృక్పథాన్ని, వారి ఉదార స్వభావాన్ని పట్టణ ప్రజలు హృదయపూర్వకంగా అభినందిస్తున్నారు.

# దిర్శించర్ల పాఠశాలలో బోధన తీరుపై ప్రత్యేక దృష్టి..





- **అత్యధిక నమోదు సాధించిన ఉపాధ్యాయులకు అభినందనలు**

సూర్యాపేట /నేరేడుచర్ల / జూలై 30 / అక్షరం న్యూస్

నేరేడుచర్ల మండలంలోని దిర్శించర్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బట్టు మధు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులను పరిశీలించి, విద్యార్థులకు జరుగుతున్న బోధన--అభ్యసన ప్రక్రియను నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల అభ్యాస నైపుణ్యాలు, ఉపాధ్యాయుల బోధన విధానాన్ని తెలుసుకుని నాణ్యమైన విద్య అందించే దిశగా పలు స వా చ న ల ం చేశారు. మండలంలోనే అత్యధిక విద్యార్థుల నమోదు (ఎన్‌రోల్‌మెంట్) సాధించినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మామిళ్ల శ్రీనివాస్ రెడ్డితో పాటు ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. ఇదే స్ఫూర్తితో విద్యార్థుల హాజరు, అభ్యాస ఫలితాలను మరింత మెరుగుపరచాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రారంభించిన ప్రీ-ప్రైమరీ తరగతులను పరిశీలించిన బట్టు మధు, చిన్నారులకు ఆటలు, పాటలు, కథలు, సరైన ఉచ్చారణ, హావభావాలతో కూడిన ఆనందదాయకమైన వాతావరణంలో బోధన అందించాలని సూచించారు. ప్రీ-ప్రైమరీ తరగతుల నిర్వహణ కోసం నూతనంగా నియమితులైన ఇన్‌స్ట్రక్టర్ రవళి, ఆయా శైలజలను అభినందిస్తూ, చిన్నారుల్లో అభ్యాసంపై ఆసక్తి పెంపొందించేలా వినూత్న బోధన పద్ధతులను అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం. సంధ్యారాణి, బి. స్వాతి, రాములు, ఓఎస్ అంజయ్య పాల్గొన్నారు. అవసరమైతే దీనికి పత్రిక మొదటి పేజీకి సరిపోయే మరింత ఆకర్షణీయమైన శీర్షిక కూడా సిద్ధం చేస్తాను.

# సంపూర్ణ గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలి






- **చెత్త వేరు చేసే విధానంపై అవగాహన పెంచుకోవాలి**

జనగామ జిల్లా/ రఘునాథపల్లి/( అక్షరం న్యూస్)జూలై 30: సంపూర్ణ గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలని, నాలుగు రకాల చెత్త వేరు చేసే విధానంపై ప్రతి ఒక్కరు మరింత అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఆశ్వరావుపల్లి సర్పంచ్ పొన్నగంటి చైతన్య రాజు అన్నారు. మండలంలోని ఆశ్వరావుపల్లి గ్రామ పంచాయతీకార్యాలయంలో గురువారంనిర్వహించిన గ్రామ సభలో సర్పంచ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కడియం శ్రీహరిసహకారంతో సంపూర్ణ గ్రామాభివృద్ధికి అంకితభావంతోపనిచేస్తానని అన్నారు. ప్రతి ఒక్కరు తమ పరిసరాలను పరిశు భ్రంగాఉంచుకునేటట్లు గ్రామ పంచాయతీ సిబ్బంది. వార్డు సభ్యులు ప్రజలనుచైతన్యపర్చాలన్నారు. అనంతరం గ్రామస్థులకు నాలుగు రకాల చెత్త వేరు చేసే విధానంపై అవగాహన కల్పించారు. తడి చెత్త, పొడి చెత్త, శానిటరీ వ్యర్థాల చెత్త, గృహ ప్రమాదకర చెత్త అయిన రంగు డబ్బాలు, పురుగుల మందుల డబ్బాలు తదితర చెత్తలను వేర్వేరుగాసేకరించేఅలవాటు ప్రాముఖ్యత గురించి పంచాయతీ కార్యదర్శి వివరించారు. ఇంటి చెత్తను రోడ్లపై, కాలువల్లో, ఖాళీ ప్రదేశాల్లో పడవేయకుండా, గ్రామ పంచాయతీ చెత్త సేకరించే ట్రాక్టర్లోనే వేసే అలవాటుచేస కోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కోటి, ఎఈవో కల్పన, హైస్కూల్, ప్రైమరీ స్కూల్ హెచ్ఎంలు శోభన్ కుమార్, భద్రు నాయక్, వార్డు సభ్యులు పొదల లవకుమార్, కొలిపాక దశరథ, నూనెముంతల శారద, నీల రాజవ్వ, పరుశరాములు తో పాటు అంగన్వాడి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నారు పోసిన రైతులను ఆదుకోండి

- సీతారామ కాలువ నీళ్లు వదలండి.
- మూకమామిడి ప్రాజెక్టుకు సీతారామ ప్రాజెక్ట్ కాలువ నీళ్లు వదలాలి.
- ఎమ్మార్వో స్వాతి బిందుకు వినతి పత్రం అందజేసిన సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా /ములకలపల్లి / జులై 30 / అక్షరం న్యూస్ -:

ఏల్ నినో ప్రభావంతో వర్షాలు సరిగా పడకపోవడంతో మూకమామిడి ప్రాజెక్టు చెరువు నిండకపోవడంతో ప్రాజెక్టు కింద ఆయకట్టు రైతులు నారు పోసి వరి నాట్ల కోసం ప్రాజెక్ట్ నీళ్ల కోసం ఎదురుచూస్తూ ఆందోళన చెందుతున్నారని. గురువారం ములకలపల్లి మండల తహసిల్దార్ స్వాతి బిందుకు సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి .రైతులతో కలిసి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్ట్ కాలువ నీళ్లు మూకమామిడి ప్రాజెక్టుకు వదలాలని ఆల్ నీనో ప్రభావం వల్ల వర్షాలు పడకపోవడంతో ప్రాజెక్టు నిండకపోవడం రైతులు ఆందోళన చెందుతున్నారని తక్షణమే రైతులను ఆదుకోవాలని సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ నుండి యుద్ధ యుద్ధప్రతిభవన మూకమామిడి ప్రాజెక్టుకు నీళ్లు వదలాలని కోరారు. మూకమామిడి గ్రామపంచాయతీ మరియు చవిటిగూడెం గ్రామపంచాయతీ రైతులు ఇప్పటికే వేలాది ఎకరాల్లో వరి నారు పోశారు అని,నారు దశలో ఉండగానే నీరు అవసరం కావడంతో రైతులు నీటి కోసం ఎదురుచూస్తున్నారు. కానీ ఈ ఏడాది వర్షాలు తక్కువగా పడటంతో ప్రాజెక్టు చెరువు నిండలేదు. ఈ పరిస్థితుల్లో రైతులను ఆదుకునేందుకు సీతారామ ప్రాజెక్టు కాలువ నుండి నీటిని వెంటనే మూకమామిడి ప్రాజెక్టులోకి విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నీరు విడుదల చేస్తే వేలాది ఎకరాల పంటలు కాపాడబడతాయని రైతుల తరుపున కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోతుగంటి లక్ష్మణ్,శాస్త్ర బోయిన వెంకటేశ్వర్లు, ఎర్ర గొర్ల రామారావు, ఓరుగంటి శీను అశోక్ శివ మరియు రైతులు పాపారావు కాంతారావు రాజులు నాగేష్ వెంకటేష్ శీను తదితరులు పాల్గొన్నారు.

## మందమర్రిలో దంచి కొడుతున్న వానలు

- ముందస్తు చర్యలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు.



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ జులై 29/ అక్షరం న్యూస్-:

మందమర్రిలో మంగళవారం సాయంత్రం నుండి ఎడతెరిపి లేకుండా కురాస్తున్న వర్షానికి స్థానిక ఇందు గార్డెన్ తో పాటు బురద గూడెం కామాఖ్య ఆలయం సమీపంలో భారీగా వాగు ఉప్పొంగి వరదనీరు చేరింది. దీనితో విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు పట్టణ ప్రజలను అప్రమత్తం చేశారు. వర్షంలోనే తన సిబ్బందితో తిరుగుతూ ప్రజలతో మాట్లాడారు. హిందూ గార్డెన్ తో పాటు ఆయా కాలనీలో వరద నీరును జెసిబి తో తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు బయటకు రావద్దని తెలిపారు. ఎక్కడైనా నీరు నిలిచిపోతే వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండడం మంచిదన్నారు. మంత్రి వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు ప్రజలను వర్షాకాలంలో అప్రమత్తం చేయాలని చెప్పడం జరిగిందన్నారు. కాలనీలలోఎక్కడ వర్షపు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారని అన్నారు. మంత్రి వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు వార్డులో ఎక్కడైనా వర్షం నీరు నిలిచిపోతే తొలగిస్తామని చెప్పారు. ప్రజల అవసరాల కోసం తమ సిబ్బంది పని చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. భారీ వర్షంలో ఆయా కాలనీలలో నిలిచిపోయిన నీరును జెసిబి తో తొలగించడం పట్ల ఆయా వార్డుల ప్రజలు కమిషనర్ పనితీరుపై హర్షం వ్యక్తం చేశారు.



# పరిపురం గ్రామంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ





ఓదెల పెద్దపల్లి జూలై 30అక్షరం న్యూస్

ఇటీవల భారీ వర్షాలకు ఓదెల మండలంలోని హరిపురం గ్రామంలో విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో గ్రామంలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది వెంటనే స్పందించిన సర్పంచ్ గ్యార వేణి విజయ నాగరాజువిద్యుత్ శాఖ ఏడి రవీందర్ , ఓదెల ఏఈ మోహన్ నాయక్ లకు సమాచారం అందించగా, అధికారులు వెంటనే స్పందించి సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని మరమ్మతు ఎ ´ న ం ల ం ప్రారంభించారు. విద్యుత్ సరఫరా పూర్తిగా పునరుద్ధరించే వరకు సర్పంచ్ గ్యారవేని విజయ నాగరాజు యాదవ్ విద్యుత్ శాఖ అధికారులతో కలిసి సంఘటన స్థలంలోనే ఉండి పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, మరమ్మతులు వేగంగా పూర్తయ్యేలా సమన్వయం చేశారు. గ్రామ ప్రజల సమస్యను వెంటనే గుర్తించి, విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసి విద్యుత్ సరఫరా త్వరగా పునరుద్ధరించేందుకు కృషి చేసిన సర్పంచ్ గ్యారవేని విజయ నాగరాజు యాదవ్ కి గ్రామ ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భాస్కర్, లైన్ ఇన్స్పెక్టర్ సదానందం, వార్డు సభ్యులు ఆసరి మహేందర్, బేరం రాజయ్య, మాకోటి ఓదెలు, ముప్పు రాకేష్, తుమ్మల లక్ష్మయ్య, తోట్ల హరీష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలం నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ కుమార్ దీపక్ స్తానిక అధికారులతో కలిసి పరిశీలన.
- పట్టణంలో పర్యటించిన మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి.



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ జూలై 30/ అక్షరం న్యూస్–:

మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పట్టణంలోని పలు ప్రాంతాలను కార్మిక, ఉపాధి, శిక్షణ అండ్ కర్మాగారాలు, గనులు మరియు భూగర్భ శాఖ, మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర టెంపుల్ ప్రాంతంలో భారీ వర్షాల కారణంగా శ్రీమతి అయిల్ల కనకమ్మ నివాస గృహం కూలిపోవడంతో సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. అనంతరం విద్యానగర్‌లోని అమ్మగుడి (కామాఖ్య దేవాలయం) సమీపంలో వర్షపు నీటితో కాలువ పొంగి పొర్లుతూ ప్రవహిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక పూజారి సతీష్ భవాని కాలువ పొంగిపొర్లడం వల్ల అమ్మగుడికి దర్శనానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రివర్యుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన మంత్రివర్యులు సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు చేపట్టి నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చూడడంతో పాటు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మందమర్రి మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు, తహసీల్దార్ పనకంటి సతీష్ కుమార్ శర్మ, మున్సిపాలిటీ ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ వి. వసంత్, మున్సిపాలిటీ సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కంచనపల్లి రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలిపిన సిపిఎం నాయకులు



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్)జూలై 30: రఘునాథపల్లి మండల కేంద్రంలోని కంచనపల్లి రోడ్డుపై ఇటీవల కురిసిన వర్షానికి నిలిచిన వర్షపు నీటిలో సిపిఎం నాయకులు నాట్లు వేసి గురువారం వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు గంగాపురం మహేందర్ మాట్లాడుతూ మండల కేంద్రం నుండి కంచనపల్లి, గబ్బెట, కోడూరు, కోతు లబాద్, ఈరవెన్ను తదితర గ్రామాలకు వేళ్లే మండల కేంద్రంలోని రోడ్డుపై వర్షపు నీరు నిలువడంతో వాహనాలతో పాటు వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సత్వరమే స్పందించి రోడ్డుపై వర్షపు నీరు నిలువకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కాడారి ఐలయ్య, కాసాని పుల్లయ్య. పులిగిల్ల రాజు, వెంకటయ్య. తోటకూరి నరేష్, పార్నంది ఆనందం, తోటకూరి మమత, మంచాల రాజు తదితరులు పాల్గొన్నారు.

## గుంపుల గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం



ఓదెల పెద్దపల్లి జులై 30అక్షరం న్యూస్

ఓదెల మండలంలోని గుంపుల ఎస్సీ కమ్యూనిటీ హాల్లో గురువారం జిపిఓ పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ పలువురు మాట్లాడుతూ పౌర హక్కుల దినోత్సవం అనేది రాజ్యాంగం ద్వారా పౌరులకు కల్పించబడిన సమానత్వం స్వేచ్ఛ మరియు హక్కుల పై అవగాహన కల్పించడమే ఉద్దేశమని గ్రామీణ ప్రాంతాల్లో కుల వివక్షతను రూపుమాపడానికి అట్టడుగు వర్గాలకు రాజ్యాంగం ద్వారా సక్రమించిన హక్కులపై అవగాహన కల్పించడానికి ప్రతినెల 30వ తేదీన పౌరహక్కుల దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందని అన్నారు ప్రతి పౌరునికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు ల ప్రాథమిక హక్కులు గురించి తెలియజేయడమే వివక్షత నిర్మూలన కుల మత లింగ విభేదాలు లేకుండా అందరికీ సమాన అవకాశాలు కల్పించడం హక్కుల పరిరక్షణ అని అన్నారు పౌరుల హక్కులకు భంగం వాటిల్లినప్పుడు లేదా దోపిడి గురైనప్పుడు చట్టపరంగా ఎలా రక్షణ పొందాలో ఈ కార్యక్రమంలో అవగాహన కల్పించారు మానవ హక్కుల ఉల్లంఘన లేదా వివక్షత ఎదురైతే సహాయం కోసం జాతీయ మానవ హక్కుల సంఘాన్ని సంప్రదించాలని అన్నారు అనేక సంక్షేమ పథకాలు ఎస్సీ ఎస్టీలకు అందుతున్నాయా లేదా అనేది తెలుసుకోవడం కోసం ఇలాంటి సమావేశాలు దోహదపడతాయని అదే విధంగా కుల మతాలకు అతీతంగా తారతమ్యం లేకుండా ఒకే గ్లాస్ ఒకే విధానం అంటరానితనం నిర్మూలించడం కోసమే ఇలాంటి సమావేశాలు దోహదపడతాయని అన్నారు ఈ కార్యక్రమంలో జిపిఓ గ్రామ కార్యదర్శి అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఎస్సీ కమ్యూనిటీ పెద్దలు యువకులు పాల్గొన్నారు

## ఎంపీ డీకే అరుణ ను కలిసిన బి. సంజయ్ కుమార్



మంచిర్యాల జిల్లా/మందమర్రి/ జూలై 30/అక్షరం న్యూస్ –:

భారతీయ జనతా పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్ నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ ని గురువారం డిల్లీ లో పార్లమెంట్ వద్ద పెద్దపల్లి టిడిపి పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు బి.సంజయ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## శాస్త్రీయ పద్ధతులతో పాల దిగుబడి పెంచాలి..

- సంఘం అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి..



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/జూలై 30/అక్షరం న్యూస్:–

రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తే పాల ఉత్పాదకత పెరిగి ఆదాయం మెరుగుపడుతుందని ముల్కనూర్ సహకార సంఘం అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ సహకార బ్యాంకులో గురువారం పాడి పశువుల సంరక్షణ పాల ఉత్పాదకత పెంపుపై రైతులకు అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. వై. రాధాకృష్ణ, సహాయ సంచాలకులు డా. ఎన్. సత్యప్రసాద్‌రెడ్డి డా. రఘుబాబు మాట్లాడుతూ పాడి రైతులు శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు సమతుల్య దాణా నాణ్యమైన గడ్డి దూడల సంరక్షణ పునరుత్పత్తి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

శిక్షణలో డా. జె. రవికుమార్ గడ్డి రకాలు, పశువుల పోషణ, డా. రాజన్న పాడి పశువుల యాజమాన్య పద్ధతులు డా. రాజబాబు దూడల సంరక్షణ, డా. రాజిరెడ్డి గర్భకోశ సంబంధిత వ్యాధుల నివారణ చికిత్స అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ నిపుణులు సూచించిన శాస్త్రీయ విధానాలను ఆచరణలో అమలు చేస్తే ఒక్కో పాడి పశువు నుంచి అధిక పాల దిగుబడితో పాటు రైతుల ఆదాయం కూడా పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ ఎం. రాంరెడ్డి, కార్యవర్గ సభ్యులు, స్థానిక పశువైద్యులు, రైతులు పాల్గొన్నారు.



## మండేలగూడెం పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్)జూలై30:మండలంలోని మండేలగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో రఘునం దన్ రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన, విద్యా బోధనలో ఉపాధ్యాయుల పని తీరు తదితర అంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ డ్యాగల రాజశేఖర్, ఉప సర్పంచ్ బొనాసి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు

## ఉపాధ్యాయులు టిఎల్ఎం బోధనను కొనసాగించాలి

- మండల విద్యాధికారి రఘునందన్ రెడ్డి



జనగామ జిల్లా/ రఘునాథపల్లి/( అక్షరం న్యూస్) జూలై 30:

ఉపాధ్యాయులు టిఎల్ఎం ని ఉపయోగిస్తూ బోధన కొనసాగించాలని రఘునాథపల్లి మండల మండల విద్యాశాఖ అధికారి పాకనాటిరఘునందన్ రెడ్డి కోరారుమండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో జరిగిన ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్ కార్యక్రమానికి కోర్సు డైరెక్టర్ గా వ్యవహరించి, రెండవ బ్యాచ్ మూడవ రోజు ముగింపు సమావేశంలో ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ

టిఎల్ఎం ని ఉపయోగించి వైయక్తిక భేదాలను దృష్టిలో పెట్టుకొని భోధన కోనసాగించాలని తెలుగు భాష నైపుణ్యంలో వినటం, మాట్లాడటం, పఠనం, లేఖనంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, గణితంలో చతుర్విధ ప్రక్రియలైన కూడికలు, తీసివేతలు, గుణకారాలు, భాగహారాలు, పిల్లల పాఠ్యాంశాల్లో భాగమై ఉండాలని, ఆంగ్ల భాషలో విద్యార్థులకు ప్రతిరోజూ 10పదాల చొప్పున నెలలో 200పదాలు నేర్చుకునే విధంగా తయారు చేయాలని సూచించారు

ఈకార్యక్రమానికి మండల ఆర్పిలుగా సునిత, రాజు, రాజేందర్, యం.ఆర్.సి సిబ్బంది సమ్మయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## వర్షాల తో ... ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- జనగామ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు లింగాల జగదీష్ చందర్ రెడ్డి



జనగామ జిల్లా/ రఘునాథపల్లి/( అక్షరం న్యూస్) జులై 30:

రాబోయే రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జనగామ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు లింగాల జగదీష్ చందర్ రెడ్డికోరారు,అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని, వాగులు,వంకలు, చెరువులు, వరదప్రవాహాలు ఉన్న ప్రాంతాలను ఎట్టి పరిస్థితుల్లోనూ దాటేందుకు ప్రయత్నించవద్దనిసూచించారు. ఉరుములు, మెరుపుల సమయంలో చెట్ల కింద నిలబడకుండా సురక్షిత ప్రదేశాల్లో ఉండాలని, విద్యుత్ తీగలు తెగిపడిన ప్రాంతాలు, శిథిల భవనాలకు దూరంగా ఉండాలని తెలిపారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు, రైతులు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని, వాతావరణ శాఖ, స్థానిక అధికారుల హెచ్చరికలను తప్పనిసరిగా అనుసరించాలని సూచించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించి, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ తమతో పాటు ఇతరుల భద్రతను కూడా కాపాడాలని లింగాల జగదీష్ చంద్ర రెడ్డి విజ్ఞప్తి చేశారు

## వర్షాల తో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**•జనగామ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు లింగాల జగదీష్ చందర్ రెడ్డి**



జనగామ జిల్లా/ రఘునాథపల్లి/( అక్షరం న్యూస్) జులై 30:

రాబోయే రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జనగామ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు లింగాల జగదీష్ చందర్ రెడ్డికోరారు,అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని, వాగులు,వంకలు, చెరువులు, వరదప్రవాహాలు ఉన్న ప్రాంతాలను ఎట్టి పరిస్థితుల్లోనూ దాటేందుకు ప్రయత్నించవద్దనిసూచించారు. ఉరుములు, మెరుపుల సమయంలో చెట్ల కింద నిలబడకుండా సురక్షిత ప్రదేశాల్లో ఉండాలని, విద్యుత్ తీగలు తెగిపడిన ప్రాంతాలు, శిథిల భవనాలకు దూరంగా ఉండాలని తెలిపారు.చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు, రైతులు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని, వాతావరణ శాఖ, స్థానిక అధికారుల హెచ్చరికలను తప్పనిసరిగా అనుసరించాలని సూచించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించి, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ తమతో పాటు ఇతరుల భద్రతను కూడా కాపాడాలని లింగాల జగదీష్ చంద్ర రెడ్డి విజ్ఞప్తి చేశారు

## పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



జనగామజిల్లా/ రఘునాథపల్లి/( అక్షరం న్యూస్) జూలై 30:

నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి గురువారం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఇటీవల గుండెపోటుతో అస్వస్థతకు గురైన పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రస్తుతం యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఆయన ఆరోగ్య పరిస్థితిని కడియం శ్రీహరి అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి అందుతున్న చికిత్స వివరాలను తెలుసుకుని, మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు.అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి సతీమణి స్వప్నతో పాటు కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు ధైర్యంగా ఉండాలని సూచించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు

## వర్షపు నీరు నీల్వ లేకుండా మున్సిపల్ చైర్మన్ చర్యలు.

**•వర్షపు నీటి సమస్యపై పరిశీలించి వెంటనే తొలిగించాలి.**



పెద్దపల్లి జిల్లా / పెద్దపల్లి టౌన్ / జూలై 30 / అక్షరం న్యూస్ –:

వర్షాల నేపథ్యంలో పట్టణంలోని ఓపెన్ ప్లాట్లలో నీరు నిల్వ కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య సూచించారు. పెద్దపల్లి పట్టణంలోని 12వ వార్డు సాగర్ రోడ్డులో ఉన్న ఓపెన్ ప్లాట్లలో వర్షపు నీరు నిలిచి స్థానికులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కౌన్సిలర్ దొడ్డుపల్లి జగదీష్ మున్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గురువారం చైర్మన్ నూగిల్ల మల్లయ్య ఆ ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఓపెన్ ప్లాట్ల యజమానులు వర్షపు నీరు నిల్వ కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో కచ్చా కాలువలు ఏర్పాటు చేసి నీటి నిల్వ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మున్సిపాలిటీ తరఫున ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు చైర్మన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొడ్డుపల్లి శేఖర్, అజయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# దసరా నాటికీ ఆర్టీసీ బస్సుడిపో నిర్మాణం

**•పెద్దపల్లి ప్రజల చిరకాల కల బస్సు డిపో.**

**•నూతన బస్సు డిపోతో పెరగనున్న రవాణా సౌకర్యాలు..**

**•కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుంది.**

**•ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు..**



పెద్దపల్లి జిల్లా / పెద్దపల్లి టౌన్ / జూలై 30 / అక్షరం న్యూస్ –:

సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ప్రజల చిరకాల కోరిక పెద్దపల్లి బస్ డిపో కల నెరవేరబోతుందని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. . పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఆర్టీసీ బస్సు డిపో నిర్మాణ పనులను ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో కలిసి గురువారం రోజున ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మాణం చేస్తున్న బస్సు డిపో పనులను తెలంగాణ ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో కలిసి పరిశీలించడం జరిగింది అని దసరా వరకు పెద్దపల్లి బస్సు డిపో ప్రారంభించే దిశగా పనులు త్వరత్వరగా జరిగేల ఎం.డి అధికారులకు మరియు కాంట్రాక్టర్ కు తెలిపారని అన్నారు. బస్సు డిపో పెద్దపల్లి నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష అని ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మూడు రెవెన్యూ డివిజన్లల్లో బస్సు డిపో ఉన్నప్పటికీ మొదటి నుండి పెద్దపల్లి కూడా రెవెన్యూ డివిజన్ అయినప్పటికీ కూడా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో గత ప్రభుత్వ హయాంలో డిపో లేకపోవడం సిగ్గు చేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను శాసనసభ్యులుగా ఎన్నికైన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పెద్దపల్లి ప్రజల ఆకాంక్ష అయిన బస్సు డిపో మంజూరు చేయమని వినతి పత్రం అందజేసిన తర్వాత వారు పెద్దపల్లి ప్రజలపై ఉన్న మమకారంతో వారు 2024 డిసెంబర్ మాసంలో పెద్దపల్లి ప్రాంతానికి విచ్చేసి యువ వికాసం బహిరంగ సభలో బస్సు డిపో మంజూరు చేయడం జరిగిందని అన్నారు. పెద్దపల్లి బస్సు డిపోను దసరా వరకు పూర్తి చేస్తామని ఆర్టీసీ ఎండీ తెలిపారని ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్, ఆర్టీసీ అధికారులు, పట్టణ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, పలు గ్రామాల సర్పంచులు, సింగిల్ విండో చైర్మన్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసిన నిందితుడు అరెస్టు

**•నిందితుడిపై 9 కేసులు. -సీఐ ప్రవీణ్ కుమార్ వెల్లడి.**

**•సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు**



పెద్దపల్లి జిల్లా / పెద్దపల్లి టౌన్ / జూలై 30 / అక్షరం న్యూస్ –:

పెద్దపల్లి బస్టాండ్ సమీపంలో జరిగిన ద్విచక్ర వాహన చోరీ కేసును పోలీసులు ఛేదించి నిందితుడిని అరెస్టు చేశారు. గురువారం పోలీస్ స్టేషన్ లో పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పెద్దపల్లి భరత్‌నగర్‌కు చెందిన మామిడిపల్లి ప్రదీప్ ఈ నెల 20న తన ద్విచక్ర వాహనాన్ని పెద్దపల్లి బస్టాండ్ వద్ద ఫార్మసీ ముందు పార్క్ చేసి మంథనికి వెళ్లాడు. సాయంత్రం తిరిగి వచ్చేసరికి బైక్ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పెద్దపల్లి టౌన్ ఎస్ఐ కె. నరేష్ సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టి నిందితుడిని గుర్తించారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఈనెల 29న చీకురాయి చౌరస్తా వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో రాజక్కపల్లి జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం చెందిన రాజక్కపల్లికి చెందిన రంగు గంగాధర్ ను దొంగిలించిన బైక్‌తో పాటు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడిపై ఇప్పటికే తొమ్మిది క్రిమినల్ కేసులు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అతడిని న్యాయస్థానంలో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు. కేసును త్వరితగతిన ఛేదించిన ఎస్ఐ కె. నరేష్, పోలీసు సిబ్బంది ప్రభాకర్, సతీష్ లను పెద్దపల్లి సీఐ కె. ప్రవీణ్‌కుమార్ అభినందించారు.

## మొలంగూర్ దూద్ బావిని సందర్శించిన డిఆర్డిఓ



కరీంనగర్ / శంకరపట్నం / జూలై 30 / (అక్షరం న్యూస్ –:

కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలోని చారిత్రాత్మక దూద్ బావిని గురువారం డిఆర్డిఓ మచ్చ గీత సందర్శించారు.దూద్ బావి నీరు పాలవలే తెల్లగా ఉంటుందని దీర్ఘకాలిక వ్యాధులు నయం అవుతాయని ఏళ్ల నాటి నుండి ప్రజల విశ్వాసమని ఆమె అన్నారు. దూద్ బావి నీరును స్వయంగా వెలికి తీసి తాగారు.నీరు పాలవలే తెల్లగా రుచికరంగా ఉన్నాయన్నారు.మొలంగూర్ ఖిలా ప్రాముఖ్యత,ప్రత్యేకత పరిసరాలపై ప్రజలను నేరుగా అడిగి తెలుసుకున్నారు.దూద్ బావిని సందర్శించి నీరు తాగడం ఆనందంగా ఉందన్నారు.వీరి వెంట ఎస్బిఎం కరుణాకర్,ఎస్బిఎం కోఆర్డినేటర్ రమేష్,సీసీ రంజిత్,తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి వరదలపై అన్ని శాఖలు పూర్తి అప్రమత్తంగా ఉండాలి

**•మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అయ్యే అవకాశం నేపథ్యంలో ముందస్తు చర్యలు ముమ్మరం చేయాలి: జిల్లా కలెక్టర్ అంకిత్.**



భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / జూలై 30 / అక్షరం న్యూస్ –:

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నదికి వరద ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో, శుక్రవారం ఉదయం నాటికి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అయ్యే అవకాశం ఉన్నందున జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.గోదావరి వరద పరిస్థితులు, చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై గురువారం జిల్లా కలెక్టర్ అంకిత్ అన్ని శాఖల జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గోదావరిలో నీటి ప్రవాహం నిరంతరం పెరుగుతున్నందున పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని, గ్రామస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని, అవసరమైతే మైకుల ద్వారా హెచ్చరికలు జారీ చేయాలని సూచించారు.లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను గుర్తించి అవసరమైతే ముందుగానే సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించేలా కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, ఆహారం, వైద్య సేవలు, తాత్కాలిక వసతి తదితర అన్ని మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని సూచించారు. వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలు, దివ్యాంగులకు అవసరమైన ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.మత్స్యశాఖ అధికారులు గజ ఈతగాళ్లు, బోట్లు, లైఫ్ జాకెట్లను సిద్ధంగా ఉంచాలని, అగ్నిమాపక శాఖ, పోలీసు, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్, విద్యుత్ తదితర శాఖలు అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు.గోదావరి స్నాన ఘాట్లు, పర్యాటక ప్రాంతాలు, నది తీర ప్రాంతాల్లో బ్యారికేడ్లు ఏర్పాటు చేసి ప్రజలు నదిలోకి వెళ్లకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, పోలీసు శాఖ నిరంతర బందోబస్తు నిర్వహించాలని ఆదేశించారు. గోదావరి ప్రవాహం తగ్గే వరకు నదిలో చేపల వేట, పడవల రాకపోకలు, అనవసరంగా నది వద్దకు వెళ్లడాన్ని నియంత్రించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ పరిస్థితిని సమీక్షించాలని, వరద పరిస్థితులకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు జిల్లా నియంత్రణ కేంద్రానికి అందించాలని, ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అన్ని ముందస్తు చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. సాయంత్రం 6.00 గంటల నాటికి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 28.40 అడుగులుగా నమోదైంది. ప్రస్తుతం నీటి ప్రవాహం 3,88,452 క్యూసెక్కులుగా ఉంది. మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి 43.00 అడుగులు కాగా, ఆ సమయంలో సుమారు 9,32,288 క్యూసెక్కుల ప్రవాహం నమోదయ్యే అవకాశం ఉంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో గోదావరి నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉన్నందున అధికారులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అధికారుల సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.

## తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా చీరల పంపిణీ

**•మధ్యాహ్న భోజన,పారిశుద్ధ్య సిబ్బందికి చీరల పంపిణీ.**

కరీంనగర్/శంకరపట్నం/జులై 30(అక్షరం న్యూస్ )

కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కీ.శే. శ్రీమతి ఎల్లవ్వ--గోపయ్య దంపతుల జ్ఞాపకార్థంగా కుమారుడు గుంటి రాజయ్య వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా కొత్తగట్టు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు,పారిశుద్ధ్య సిబ్బందికి చీరలను పంపిణీ చేసి వారిని సన్మానించారు. అనంతరం ఎంఈవో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, సమాజానికి సేవలందిస్తున్న సిబ్బందిని గౌరవించడం అభినందనీయమని అన్నారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఇతరులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కొత్తగట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్ రెడ్డి,ఏఏపీసీ చైర్మన్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

# మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి





- **అన్నపురెడ్డిపల్లి మండలంలో రూ.2.77 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు.**
- **ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశాల్లో పాల్గొన్న మంత్రి.**

మంత్రి ప్రారంభించారు.

కోండాయిగూడెం గ్రామంలోని 2బీహెచ్‌కే కాలనీలో పీఆర్-- బీటీ రోడ్డు నుండి కుంజా రాధ ఇంటి వరకు, వీరభద్రం ఇంటి నుండి దుబ్బాకారం నగేష్ ఇంటి వరకు, పద్దం మెహన్‌రావు ఇంటి నుండి మీడియం తిరుపతిరావు ఇంటి వరకు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మొత్తం రూ.20 లక్షల అంచనా వ్యయంతో

సుజాత, నరసాపురం గ్రామానికి చెందిన తిరుమలదేవి అనిత, చీపుడు జ్యోతి, ఊటుపల్లి గ్రామానికి చెందిన మొల్లచవుకు కవిత, రంగాపురం గ్రామానికి చెందిన వేముల కృష్ణయ్య, పెనుగొండ కోటమ్మల నూతన గృహాల్లో గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి

అధికారులను మంత్రి ఆదేశించారు.

ఈ సందర్భంగా అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రహదారులు,





భద్రాద్రి కొత్తగూడెం / అన్నపురెడ్డిపల్లి / జూలై 30 / అక్షరం న్యూస్ -:

రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించడంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్ తదితరులు పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా గుంపెన గ్రామంలో ఎంహెచ్ రోడ్డు నుండి పప్పుల గోపయ్య ఇంటి వరకు, గ్రామంలోని తొమ్మిది అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.45 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. నరసాపురం గ్రామంలో గాదె సుధాకర్ రెడ్డి ఇంటి నుండి నంద్యాల కేశవరెడ్డి ఇంటి వరకు, అలాగే ఎనిమిది అంతర్గత సీసీ రోడ్లు, కల్వర్టుల నిర్మాణ పనులకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్) ద్వారా రూ.117.30 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి

చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి శంకుస్థాపన చేశారు. పెద్దిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని ఎర్రగుంటలో ఆర్ అండ్ బీ రోడ్డు నుండి పైదా వీరకృష్ణ ఇంటి వరకు, అలాగే 17 అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.75.50



లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పనులకు మంత్రి

పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. మహిళల ఆర్థిక సాధికారత, రైతుల సంక్షేమం, పేద కుటుంబాల జీవన

ప్రమాణాల మెరుగుదల, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి

గ్రామపంచాయతీ భవనాలు, తాగునీటి సౌకర్యాలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు కృషి చేయాలని కోరారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు.

జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, జిల్లాలో వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, గ్రామీణ రహదారులు, గ్రామపంచాయతీ భవనాలు, తాగునీటి సౌకర్యాలు, డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు, వాగులు, వంకలు, రహదారులు, కల్వర్టుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించామని చెప్పారు. ప్రజలకు





పనులకు శంకుస్థాపన చేశారు.

భీమునిగూడెం గ్రామంలో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని

శంకుస్థాపన చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. పెద్దిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన అగ్గి రాజమ్మ, గుంపెన గ్రామానికి చెందిన మాయారా వసంత, భీమునిగూడెం గ్రామానికి చెందిన వాడే



ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ సంకల్పమని, రాష్ట్రంలో పూరిగుడిసెలు లేని తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు . అర్హులైన ప్రతి కుటుంబానికి పారదర్శకంగా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, తాగునీటి సౌకర్యాలు, డ్రైనేజీలు, గ్రామపంచాయతీ భవనాలు వంటి మౌలిక వసతులను బలోపేతం చేస్తూ సమగ్ర అభివృద్ధి సాధిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సీతారామ ప్రాజెక్టు భూనిర్వాసితుల సమస్యలను ప్రాధాన్యతతో పరిశీలించి వారం రోజుల్లో పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత

ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ సేవలను సమర్థవంతంగా అందించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, కొత్తగూడెం ఆర్టీఓ మధు, హౌసింగ్ పీడీ, పంచాయతీ అధికారి అనూష, అన్నపురెడ్డిపల్లి తాసిల్దార్, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సీనియర్ న్యాయవాది ఎంఏ రజాక్ మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన డా. నయీమ్ ఖురేషి



భద్రాద్రి కొత్తగూడెం కొత్తగూడెం / జులై 30/ అక్షరం న్యూస్ –: కొత్తగూడెంలోని ప్రముఖ సీనియర్ న్యాయవాది మహమ్మద్ అబ్దుల్ రజాక్ గురువారం తన స్వగృహం నందు తీవ్ర అస్వస్థకు గురై మృతి చెందిన వార్త తెలిసి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన నయీమ్ ఖురేషి. తనకు అత్యంత ప్రాణ స్నేహితుడని పెద్దన్నలాంటి వాడని గత ఇరవై ఏళ్లుగా మంచి అనుబంధం ఉందని స్నేహభావంతో కలిసి మెలిసి ఉండే వాళ్లమని ఒక మంచి వ్యక్తిని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. వారి స్వగృహం చేరుకొని రజాక్ భౌతికయానికి సందర్శించి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మద్దెల శివకుమార్, అంజమాన్ వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షులు ఎండి అమీర్ ఖాద్రి, ఉర్దూ ఘర్ కార్యదర్శి ఎండీ షరీఫ్, బాబు జాని ఖాన్, ఎండి జమాల్, నివాళులు తదితరులు అర్పించారు.

## ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ను నియమించాలి

- సిపిఎం మండల కార్యదర్శి వేముల బిక్షం



యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూల 30 / : ఆత్మకూరు పిహెచ్ సికి పర్మనెంట్ డాక్టరు ను నియమించాలిభవనం వర్షం వస్తే కురవడం వల్ల కొత్త భవనం నిర్మించి, 30 పడకల ఆసుపత్రిగా మార్చాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వేముల బిక్షండిమాండ్ చేశారు. గురువారం రోజున సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని పరిశీలించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.... పిహెచ్ సికి ప్రతిరోజు దాదాపు 50నుండి 100 మంది పేషేంట్లు వస్తున్నారని, కాని కనీస వసతులైన నీరు, మరగుదొడ్లు వినియోగంలో లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రెగ్యులర్ డాక్టర్ ఇద్దరూ స్టాఫ్ నర్సులు లేకపోవడంతో ప్రతిరోజు రోగులు అనేక ఇబ్బంది పడుతున్నారు. ముగ్గురు రెగ్యులర్ స్టాఫ్ నర్సులు గాను ఒకే స్టాఫ్ నర్స్ ఉండడంతో రోగుల సిబ్బందితో సమయంలో క్రిమి సంహా రక మందు తాగిన యాక్సిడెంట్ పాము , తేలు కాటుకు గురైన వారికి ప్రథమ చికిత్స అందక అనేక ఇబ్బంది పడుతున్నారు. గ్రామాల ఎ ఎన్ యం పోస్టులు కూడ కాళీగా ఉన్నాయని వాటిని వెంటనే భర్తీ చెయ్యాలని కోరారు. దాదాపు సంవత్సరాల క్రితం నిర్మించిన భవనం స్లాప్ కింద పెచ్చులు ఊడిపోతున్నాయి. ప్రజల తాగునీటి కోసం వాటర్ ప్లాంటును వెంటనే ప్రారంభించాలని కోరారు. ఇప్పటికైన స్థానిక ఎమ్మెల్యేచొరవచూపి, వర్షం వస్తే భవనం కురవడం ఉన్న పిహెచ్ సికి కొత్త భవనం నిర్మించి, డాక్టర్ను పర్మినెంట్ నియమించాలని ఇద్దరిని స్టాఫ్ నర్స్ లను నియమించాలని 24 గంటలు వైద్యం అందుబాటులో ఉండాలని నీటి కొడత లేకుండా చూడాలని అన్నారు .ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల సీనియర్ నాయకులు రచ్చ గోవర్ధన్ , టౌన్ కార్యదర్శి రాచమల్ల సత్తయ్య , మండల కమిటీ సభ్యులు తుమ్మల సత్యనారాయణ రెడ్డి , మల్లెల శ్రీశైలం , వెంకన్న, తదితరులు పాల్గొన్నారు...

## బిర్లా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మృతుడి కుటుంబానికి బియ్యం పంపిణీ



యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూలై 30 / : ఇటీవల అనారోగ్యంతో చనిపోయిన ఆటో కార్మికుడు గుడ్ల శంకర్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బిర్లా ఐలయ్య అదేవిధంగా బిర్లా ఫౌండేషన్ చైర్మన్ బిర్లా అనిత వారి కుటుంబానికి బియ్యాన్ని వార్డ్ నాయకులు టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు నరసింహ గౌడ్ , ఆటో యూనియన్ అధ్యక్షులు బాకీ మొగులయ్య , సోషల్ మీడియా కోఆర్డినేటర్ గుడ్ల నరేష్ , ఐదవ వార్డ్ అధ్యక్షులు గోర్ల నరేష్ , యువనాయకులు అనంతల శివ , బిర్లా ఐలయ్య ఆదేశాల మేరకుఇవ్వడం జరిగింది.

# ప్రజల గుమ్మం వద్దకే సంక్షేమ ఫలాలు చేరవేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం : రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- చంద్రుగొండ మండలంలో రూ.1.25 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన.
- పూరి గుడిసెలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతాం.
- రాష్ట్రవ్యాప్తంగా 7 లక్షల ఇందిరమ్మ గృహాల నిర్మాణం చేపట్టాం.



భద్రాద్రి కొత్తగూడెం / చంద్రుగొండ / జూలై 30 / అక్షరం న్యూస్ –:

రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలంలో విస్తృతంగా పర్యటించి 1.25 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.మంత్రి ముందుగా



మంగయ్య బంజార గ్రామంలో రూ.45 లక్షల వ్యయంతో మంగయ్య బంజారు--గానుగపాడు రహదారిపై గ్రావెల్ రోడ్డు, కల్వర్టు నిర్మాణం, ఇల్లంగి బాబు ఇంటి నుండి కాజ్‌వే వరకు సీసీ రోడ్డు, కాజ్‌వే నుండి గానుగపాడు రహదారి వరకు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి 24 ఇందిరమ్మ గృహాలను మంజూరు చేసినట్లు ప్రకటించారు.అనంతరం పొకలగూడెం గ్రామంలో రూ.60 లక్షల వ్యయంతో నాలుగు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. యాసం లక్ష్మి ఇంటి నుండి మలిశెట్టి జానకమ్మ, కందికొండ కుమారి ఇంటి వరకు, బానోతు నరసింహ ఇంటి నుండి ఇస్లావత్ రాందాస్, గుగులోతు మంగిత్య ఇంటి వరకు, ఆర్ అండ్ బి రోడ్డు నుండి పెండయ్య ఇంటి మీదుగా పద్దం రాముడు ఇంటి వరకు, గోపు చంద్రయ్య ఇంటి నుండి వాటర్ ట్యాంక్ వరకు సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. గ్రామానికి ఇప్పటికే 77 ఇందిరమ్మ గృహాలను మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. గ్రామంలో మిగిలిన అంతర్గత రహదారుల అభివృద్ధికి కూడా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

తదుపరి రావికంపాడు గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో రాచర్ల వెంకటేశ్వర్లు ఇంటి నుండి యూపీ పాఠశాల వరకు, అనుముల ముత్తయ్య ఇంటి నుండి శ్రీరాములు రామారావు ఇంటి వరకు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా పాలన సాగిస్తోందన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని రూ.8.21 లక్షల కోట్ల అప్పులతో వదిలి వెళ్లినప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు.ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి, ఇటీవల మరో 16 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. మహిళల ఆర్థిక సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ స్వయం సహాయక సంఘాలకు రూ.70 వేల కోట్ల వడ్డీలేని రుణాలను మంజూరు చేశామని, మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు.అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు పేదలకు నాణ్యమైన సన్నబియ్యాన్ని అందిస్తున్నామని, మహిళలకు



ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, రైతు సంక్షేమ కార్యక్రమాలు, సామాజిక భద్రతా పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

ఇందిరమ్మ గృహాల పథకం కింద తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల గృహాలు, రెండో విడతలో మరో 2.50 లక్షల గృహాలు మంజూరు చేసి మొత్తం 7 లక్షల ఇందిరమ్మ గృహాల నిర్మాణాన్ని చేపట్టామని మంత్రి తెలిపారు. హైదరాబాద్ నగరంలో ప్రత్యేకంగా లక్ష ఇందిరమ్మ గృహాలను మంజూరు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఒక్క పేద కుటుంబం కూడా పూరి గుడిసెలో నివసించకుండా ప్రతి అర్హ కుటుంబానికి శాశ్వత గృహాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, అంతర్గత రహదారులు, కల్వర్టులు, తాగునీటి సదుపాయాలు, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. చంద్రుగొండ మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రజల జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరుస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ మాట్లాడుతూ , గత స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో మంగయ్య బంజార గ్రామం మొదటగా ఏకగ్రీవంగా ఎంపిక అయ్యిందని తెలిపారు. అప్పటి నుంచి గ్రామంలో మౌలిక వసతుల కల్పన, సీసీ రోడ్లు, తాగునీటి సదుపాయాలు, గృహ నిర్మాణం తదితర అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవతో చంద్రుగొండ మండలానికి పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు మంజూరవుతున్నాయని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని పనులను కూడా చేపడతామని తెలిపారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, చంద్రుగొండ మండలంలో ఇందిరమ్మ గృహాల కోసం పూరి గుడిసెల సర్వే పూర్తయిందని తెలిపారు. అర్హుల గుర్తింపు ప్రక్రియ ప్రభుత్వ



మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా కొనసాగుతోందన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధుల నివారణకు ప్రతి శుక్రవారం “ఫ్రైడే--డ్రై డే” కార్యక్రమాన్ని నిర్వహిస్తూ గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపడుతున్నామని తెలిపారు. నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవడం, దోమల నివారణ, తాగునీటి పరిశుభ్రత, ప్రజల్లో ఆరోగ్య అవగాహన కల్పనకు అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, కొత్తగూడెం ఆర్డీవో మధు, చంద్రుగొండ తాసిల్దార్ జగదీశ్వర ప్రసాద్, పంచాయతీ అధికారి అనూష, గృహ నిర్మాణ శాఖ పిడి,స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాల వికాస ఆధ్వర్యంలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా : చాడ భాస్కర్ రెడ్డి








యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూలై 30 / : బాలవికాస ఆధ్వర్యంలో గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చాడ భాస్కర్ రెడ్డి అన్నారు .గురువారం తుర్కపల్లి మండలం కోనాపురం గ్రామంలో బాలవికాస సంస్థ ఆదర్శ గ్రామ నిర్మాణంలో భాగంగా గ్రామసభను గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలవికాస సంస్థ 4 శతాబ్దాలుగా సామాజిక అభివృద్ధి పథకాలను చేపడుతూ పథకాల నిర్వహణకు ముందు జననిర్మాణ కార్యక్రమాలు నిర్వహిస్తూ, గ్రామాల్లో స్థిరమైన మార్పును అభివృద్ధిని సాధిస్తూ, కులమత, వర్గాలకు అతీతంగా ప్రజల భాగస్వామ్యంతో పథకాలను రూపొందిస్తూ, వ్యక్తిగత సామాజిక అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు అందిస్తూ ప్రజలే నాయకులుగా యాజమాన్యులు గా లబ్ధిదారులుగా పథకాల నిర్వహణలోనూ కొనసాగింపులో జననిర్మాణమే ధ్యేయంగా సుస్థిర అభివృద్ధికి నాంది పలుకుతుందని అన్నారు. ప్రజల్లో అవగాహన ఉంటే ఆలోచన ఉంటుందని, ఆలోచన బాగుంటే ఆచరణ బాగుంటుందని, ఆచరణలు బాగుంటే అభివృద్ధి బాగుంటుందని, మహిళా అభివృద్ధి, మంచి నీటి పథకాలు, రైతులకు సేద్యం ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల ఏర్పాటు వంటి అనేక పథకాలను నిర్వహిస్తూ ఆదర్శ గ్రామ నిర్మాణ పథకం ద్వారా గ్రామాల్లో స్థిరమైన మార్పును జాతీయస్థాయిలో పేరు ప్రఖ్యాతిగాంచిన గంగ దేవి పల్లి నమూనాలో గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడానికి సంస్థ కృషి చేస్తుందని అన్నారు. బాలవికాస సంస్థ ఆదర్శ గ్రామ పథకం మేనేజర్ మంజుల మాట్లాడుతూ ఆదర్శ గ్రామం అంటే రోడ్లు ,భవనాలు, నిర్మించుకోవడం కాదని, వినూత్న కార్యకలాపాలను చేపడుతూ క్రమశిక్షణతో గ్రామ ప్రజలందరూ కట్టుబాట్లు, నియమాలు పద్ధతులు పెట్టుకొని వాటిని పాటిస్తూ ఊరంతా కలిసి ఒకే మాట, ఒకే బాట ,ఐక్యంతో ఉంటే ఆదర్శ గ్రామం సాధించవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి ఒగ్గు మధు, బాలవికాస సంస్థ కోఆర్డినేటర్ రమేష్ ,డెవలప్మెంట్ ఏజెంట్ కృష్ణ వార్డు సభ్యులు పసుపుల కనకయ్య, అంకనపల్లి శ్రీలత బంగారు రెడ్డి, పసుపుల కనకయ్య, నీళ్ల మమతా దుర్గయ్య, గ్రామస్తులు, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

# ఓటరు జాబితా సవరణతో పథకాలకు సంబంధం లేదు

- **ప్రజలు అనవసర అపోహలకు గురి కావద్దు**
- **ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి స్పష్టీకరణ**



హైదరాబాద్,జూలై30: రాష్ట్రంలో ఎస్ఐఆర్ పక్రియలో భాగంగా చేపడుతున్న ఓటరు జాబితా సవరణకు, ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఎలాంటి సంబంధం లేదని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ పక్రియ పురోగతిపై జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్లతో ఎస్ఐఆర్ పక్రియలో భాగంగా డిజిటలైజేషన్ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సిఇఓ మాట్లాడుతూ కొనసాగుతున్న ఎస్ఐఆర్ పక్రియ కేవలం తప్పులు లేని ఓటరు జాబితా రూపకల్పనకు మాత్రమేనని, ప్రభుత్వం పథకాలకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించేందుకు మరో నాలుగు రోజులు గడువు మాత్రమే ఉన్నందున ఆగస్టు మూడవ తేదీలోగా డిజిటలైజేషన్ పక్రియ 100శాతం పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 76శాతం డిజిటలైజేషన్ పక్రియ పూర్తయిందని, గ్రామీణ ప్రాంతాల్లో 90శాతం పూర్తయిందని, ఇందులో ఖానాపూర్, బాల్కొండ, ఎల్లారెడ్డి, హుజూర్ నగర్, నర్సంపేట్, వర్ధన్నపేట్, పరకాల, బోధ్ నియోజకవర్గాల్లో 100శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని, ఇందుకు సంబంధించిన అధికారులను సిఇఓ ప్రశంసించారు. శేరిలింగంపల్లి, రంగారెడ్డి, మేడ్చల్, జిహెచ్ఎంసితో పాటు నిజామాబాద్, వరంగల్, ఖమ్మం లిం పట్టణ ప్రాంతాలలో డిజిటలైజేషన్ పక్రియపై సంబంధిత డిఇఓలు ప్రత్యేక దృష్టి సారించి డిజిటలైజేషన్ పక్రియను గడువులోగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఎన్యూమరేషన్ ఫారాలను డిజటలైజేషన్ చేయడంలో ఓటరు పేర్లను తప్పులు లేకుండా అప్ లోడ్ చేసేలా బిఎల్ఓలు, సూపర్ వైజర్లు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఇఆర్ఓ, ఎఇఆర్ఓలు దీనిపై సమీక్షించి తప్పులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. డిజిటలైజేషన్ లో నిర్లక్ష్యం వహించిన బిఎల్ఓలు, సూపర్ వైజర్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిఇఓ హెచ్చరించారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పోలింగ్ స్టేషన్ల రాష్నాలైజేషన్ పక్రియను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. ఒకే కుటుంబ సభ్యుల పేర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చూడాలన్నారు. ఓటర్లలో మరణించిన వారు, ఇల్లుమరిన వారి వివరాలు, అందుబాటులో లేని వారి జాబితాను సిద్ధంచేసేటప్పుడు అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించిన బిఎల్ఏల సంతకాలను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో ఇఆర్ఓ, ఎఇఆర్ఓ, బిఎల్ఓ స్థాయిలలో జరిగే రాజకీయ పార్టీల సమావేశాలను వీడియోగ్రాఫ్ చేసి డాక్యుమెంట్ చేయాలన్నారు. దాంతోపాటు విఐపి, వివిఐపిల ఓటర్లను గుర్తించి మ్యాపింగ్ చేయాలన్నారు.

# ఎగుమతుల వృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక

**అనుకూలమైన విధానాల అమలుపై దృష్టి**

**ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో సంజయ్ జాజు**

హైదరాబాద్,జూలై30: రాష్ట్రంలో ఎగుమతుల వృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, ఎగుమతిదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, కొత్త మార్కెట్ల అన్వేషణ, ఎగుమతులకు అనుకూలమైన విధానాల అమలుపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. ÷ాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గురువారం సి.ఎస్. అధ్యక్షతన రాష్ట్ర ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో పరిశ్రమలు, తయారీ (మ్యానుఫ్యాక్చరింగ్) యూనిట్లు, వ్యవసాయం, ఆహార ప్రాసెసింగ్, ఫార్మాస్యూటికల్స్, హస్తకళలు, ఐటీ ఆధారిత సేవలు తదితర రంగాల ఎగుమతులను మరింత ప్రోత్సహించేందుకు అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. గుమతుల ద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మరింత ఊతమివ్వడంతో పాటు తెలంగాణను దేశంలోని ప్రముఖ ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. త ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రం నుంచి రూ.1,22,655 కోట్ల విలువైన ఎగుమతులు నమోదయ్యాయని అధికారులు సమావేశంలో తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయ ఉత్పత్తులు, ఉద్యానవన పంటలు (హార్టికల్చర్), పౌల్ట్రీ ఉత్పత్తులు, వెజిటబుల్ సీడ్స్, రెడ్ చిల్లీ తదితర రంగాల్లో ఎగుమతులను గణనీయంగా పెంచే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు మరింతగా ఎగుమతి చేసేందుకు రాష్ట్రంలో అనుకూల వాతావరణం ఉందని వివరించారు. కేంద్ర ప్రభుత్వ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ అధికారులతో సమన్వయం పెంపొందించి రాష్ట్ర ఎగుమతుల వృద్ధికి మరింత కృషి చేయాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. ఈ సమావేశంలో పర్యాటక, సంస్కృతి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, రవాణా శాఖ కమిషనర్ ఇల్లంబర్తి, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ డా.జి.ముకుంద రెడ్డి, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, ఎగుమతుల ప్రోత్సాహక సంస్థల ప్రతినిధులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

## చైనా నుంచి ఇరాన్‌కు ఆయుధాలు

**చైనా తీరుపై ట్రంప్ అసహనం**

వాషింగ్టన్,జూలై30 అమెరికా విమానాలు, హెలికాప్టర్లకు తలనొప్పిగా మారిన కొన్ని ఆయుధాలను చైనా నుంచి ఇరాన్ కు సరఫరా చేసేందుకు రంగం సిద్ధమైంది. వీటి రవాణాకు పాకిస్థాన్‌ను మార్గంగా ఎంచుకొన్నట్లు అంతర్జాతీయ వార్తా సంస్థ సంచలన కథనం ప్రచురించింది. దీంతో అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. పాక్ పేరు ఎత్తకుండా చైనాపై అసంతృప్తి వ్యక్తం చేశారు. చైనా ఆయుధాల సరఫరా విషయం తెలుసుకొని తాను నిరాశకు గురైనట్లు పేర్కొన్నారు. తాము ఇరాన్‌కు ఆయుధాలు విక్రయించ బోమని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ స్వయంగా తనకు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. చైనా, రష్యాల నుంచి ఇరాన్‌కు ఆయుధాలు సరఫరా చేయవద్దని గత వారం ట్రంప్ హెచ్చరికలు కూడా జారీ చేశారు. చైనా నుంచి దాదాపు 60 మిలియన్ డాలర్లకు పైగా విలువైన 400 షోల్డర్గ్÷ర్డ్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల కొనుగోలుకు ఒప్పందం జరిగింది. వీటితో తమ గగనతల రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవాలని ఇరాన్ భావిస్తోంది. అయితే.. ఈ డీల్‌కు టెహ్రాన్ పక్షాన హాంకాంగ్ చెందిన ఝూంగ్‌కింగ్ బావోషాంగ్ ఇంటర్నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ మధ్యవర్తిగా ఉంది. ఈ క్షిపణులను ఉత్తర చైనా నుంచి పాకిస్థాన్ మీదుగా ఇరాన్‌లోకి చేర్చాలని ప్రణాళిక సిద్ధం చేశారు. కాకపోతే వీటిని భూమార్గంలో తరలిస్తారా..? గగనతలంలో తీసుకెళతారా అనే అంశంపై స్పష్టత లేదు. అయితే ఈ కథనాలను చైనా కొట్టిపారేయడం గమనార్హం. ఈ క్రమంలోనే తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ అంశంపై స్పందించారు.

## ఫ్రాన్‌లో విధ్వంసం సృష్టిస్తున్న కార్చిచ్చు

- **మంటలను ఆర్పేందుకు శ్రమిస్తున్న వేలాదిమంది సిబ్బంది**

ప్యారిస్,జూలై30 ఫ్రాన్స్ నైరుతి ప్రాంతంలోని గిరోండ్ అడవుల్లో చెలరేగిన కార్చిచ్చు భారీ విధ్వంసం సృష్టిస్తోంది. ఇప్పటికే వేలాది హెక్టార్ల అడవి అగ్నికి ఆహుతి అయింది. తీవ్ర వేడి, దీర్ఘకాలిక కరువు పరిస్థితులు, బలమైన గాలులు మంటలను మరింత వేగంగా వ్యాపింపజేసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది .ఈ కార్చిచ్చు ఇప్పటివరకు పారిస్ నగర వైశాల్యానికి నాలుగు రెట్లకు సమానమైన ప్రాంతాన్ని దహనం చేసింది. లక్షలాది మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వేలాది మంది అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకురావడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల సెల్సియస్ వరకు చేరే అవకాశం ఉందని వాతావరణ అధికారులు అంచనా వేస్తున్నారు. పొడి గాలుల కారణంగా ఇప్పటికే అదుపులోకి వచ్చిన ప్రాంతాల్లో కూడా మంటలు మళ్లీ చెలరేగవచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకే కొన్ని ప్రాంతాల్లో ప్రజలు తిరిగి ఇళ్లకు వెళ్లకుండా ఆంక్షలు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం భారీ మంటలు ఫ్రాన్స్‌లోని అణు కేంద్రాలు, రఫేల్ యుద్ధ విమానాల తయారీ యూనిట్ల వైపు వేగంగా దూసుకొస్తున్నాయి. ఫ్రాన్స్ అణ్వాయుధ వ్యవస్థకు సంబంధించిన ప్రదేశాలతో పాటు, అత్యంత కీలక రక్షణ, ఏరోస్పేస్ సౌకర్యాలున్న ప్రాంతానికి కేవలం 12 కిలోమీటర్ల దూరంలో మంటలు ఉన్నాయి. మంటల వల్ల ఈ కీలక కేంద్రాలకు నష్టం జరగకుండా ఉండేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మంటలు వ్యాపించకుండా ఉండేందుకు ఈ కేంద్రాలకు సమీపంలో ఉన్న చెట్లను బుల్డోజర్లతో తొలగిస్తున్నారు.

## విధి నిర్వహణలో భయానికి తావు లేదు

- **నిజాయితీగా విద్యుక్త ధర్మం నిర్వహించండి**
- **సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర**

న్యూఢిల్లీ,జూలై30: సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. విధుల్లో ధైర్యసాహసాలు ప్రదర్శించిన సిబ్బందికి సన్మానం చేసిన కార్యక్రమంలో ఆయన ఉత్తేజపూరిత ప్రసంగం చేశారు. ఎలాంటి భయం లేకుండా పనిచేయాలని బలగాలకు పిలుపునిచ్చారు. సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్‌గా ఇక్కడ నేను మీకో హామీ ఇస్తున్నాను. విధులు నిజాయతీగా నిర్వర్తించడంలో మీరు తీసుకునే నిర్ణయాలు, చర్యలకు నేను బాధ్యత వహిస్తాను. ప్రజాప్రయోజనం కోసం తీసుకునే చర్యలకు జవాబుదారీగా వ్యవహరించాల్సి వస్తే.. దానిని నేను పూర్తిగా స్వీకరిస్తానని జ్ఞానేంద్ర తన సిబ్బందిని ఉద్దేశించి పేర్కొన్నారు. ఈ నెల 20న 'చలో పార్లమెంటు' నిరసనల సమయంలో భద్రతా విధులు నిర్వర్తించిన సీఆర్పీఎఫ్-ఆర్ఏఎఫ్ బలగాలు, పోలీసులు.. విద్యార్థులపై పె÷-లలెట్ గన్‌లతో కాల్పులు జరిపినట్లు ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై విమర్శలు వ్యక్తమవుతోన్న వేళ.. జ్ఞానేంద్ర ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఆరోపణలపై సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ అంతకుముందు కూడా స్పందించారు. ఏదైనా భారీ ఆపరేషన్ తర్వాత తాము వృత్తిపరమైన మూల్యాంకనం చేపడతామని చెప్పారు. నిరసనకారులపై ఆర్‌ఏఎఫ్ సిబ్బంది తీసుకున్న చర్యల విషయంలోనూ ఆ పరిశీలన చేస్తామని తెలిపారు. అది తమ నిబంధనల్లో భాగమేనని చెప్పారు. సీఆర్‌పీఎఫ్ బలగాలు దేశవ్యాప్తంగా విధులు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్ర పోలీసులతో సహకరిస్తూ.. వైవిధ్య పరిస్థితులకు తగ్గట్టుగా వేగంగా స్పందించగల సామర్థ్యం వారి సొంతం. ఇక, ఏదైనా ప్రాంతంలో ఘర్షణలు, రద్దీ, అశాంతియుత పరిస్థితులను నెలకొన్నప్పుడు వాటిని నియంత్రించేందుకు సీఆర్‌పీఎఫ్‌లోని రాపిడ్ యాక్షన్ ఫోర్స్ ను రంగంలోకి దింపుతారు.

## శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం

కర్నూలు,జూలై30: కృష్ణా నది ఎగువ పరివాహ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల నుంచి 79,403 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం ప్రాజెక్టుకు చేరుతోంది. శ్రీశైలం నీటిమట్టం గురువారం ఉదయం 6 గంటలకు 824.80 అడుగులు.. నీటి నిల్వ 44.6090 టీఎంసీలుగా నమోదయింది. శ్రీశైలం కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించలేదు. వరద ఉధృతితో జూరాల జలాశయం కళకళలాడుతోంది. కర్ణాటకలోని ఆలమట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి మూడు రోజులుగా దిగువకు కృష్ణా జలాలు విడుదల చేస్తుండటంతో జూరాలలో క్రమేపీ మట్టం పెరుగుతోంది. జూరాల ఇన్‌ఎ÷-లో గురువారం ఉదయం 80వేల క్యూసెక్కులుగా నమోదైంది. జలవిద్యుత్ ఉత్పత్తితో 47వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టు పూర్తి నిల్వ సామర్థ్యం 9.66 టీఎంసీలు కాగా.. 10 గేట్లు ఎత్తి శ్రీశైలానికి నీరు విడుదల చేశారు.

## నారాయణపురం ఆనకట్టకు భారీగా వరదనీరు

శ్రీకాకుళం,జూలై30:శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం లాభాం పంచాయతీ వద్ద నారాయణపురం అనకట్టకు భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. నాగావళి నదిపై నిర్మించిన నారాయణపురం అనకట్ట జిల్లాలోని ప్రధాన నీటివనరుల్లో ఒకటి కావడంతో దీనిపై రైతులు ఆధారపడి వ్యవసాయం చేస్తుంటారు. ఒడిశాలో వర్షాలు కారణంగా అనకట్ట వద్దకు భారీగా వరదనీరు చేరుతోంది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక ఇబ్బంది పడుతున్న తరుణంలో అనకట్టకు సుమారు 1000 క్యూసెక్కుల నీరు చేరడం రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని ఏడు మండలాల్లో 37,053 ఎకరాలకు కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా నీరు అందుతుందని జలవనరుల శాఖ ఏఈ రామశివాజీ తెలిపారు.

# మరో లవ్ గ్రాక్ మూవీ

# శ్రీనివాస మంగాపురం

**ఆకట్టుకున్న జయకృష్ణ, రాషా తండానీ నటన**

ఘట్టమనేని కుటుంబం నుంచి యువ హీరోగా పరిచయమవుతున్న జయకృష్ణ, ప్రముఖ నటి రవీనా టండన్ కూతురు రాషా తడాని జంటగా నటించిన తాజా చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. 'ఆర్ఎక్స్ 100', మంగళవారం వంటి సంచలన చిత్రాల తర్వాత దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కించిన ఈ చిత్రంపై మొదటి నుంచి భారీ అంచనాలున్నాయి. మోహన్ బాబు, శ్యామ్, బ్రహ్మాజీ వంటి హేమాహేమీలు ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా నేడు






ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తిరుపతి నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. నగరంలో అడుగుపెట్టిన యువకుడు శ్రీను (జయకృష్ణ) .. అక్కడి పవర్ ఫుల్ వ్యక్తి పెద్దిరెడ్డి (శ్యామ్) గారాల కూతురు మంగ (రాషా తడాని)ని మొదటి చూపులోనే ఇష్టపడతాడు. ఆమెకు చేరువయ్యే ప్రయత్నంలో ఉండగా, మంగ జీవితానికి సంబంధించి ఒక షాకింగ్ నిజం తెరపైకి వస్తుంది. అసలు ఆ రహస్యాన్ని పెద్దిరెడ్డి ఎందుకు దాచాడు? శ్రీను నేపథ్యం ఏమిటి? మంగతో అతనికి ఉన్న పాత సంబంధం ఏంటి? బళ్లారి ప్రాంతానికి చెందిన వెంకటప్పయ్య (మోహన్ బాబు), లక్ష్మీపతి (అజయ్)ల మధ్య జరిగిన వివాదాలు ఈ కథను ఎలాంటి మలుపులు తిప్పాయి? చివరికి శ్రీను తన ప్రేమను ఎలా గెలుచుకున్నాడు అనేదే ఈ చిత్ర అసలు కథ. దర్శకుడు అజయ్ భూపతి కూడా 'శ్రీనివాస మంగాపురం' కోసం ఇదే రొటీన్ మాస్ కమర్షియల్ బాటపట్టారు. స్టోరీ పరంగా పెద్దగా కొత్తదనం లేకపోయినా.. విలన్ క్రూరత్వం, హీరోయిన్ వెనక హీరో పడే లవ్ ట్రాక్, మధ్య మధ్యలో వచ్చే పాటలతో ప్రథమార్ధం సాగిపోతుంది. జై కృష్ణ తన డాన్సులతో అలరించగా, నరేష్, బ్రహ్మాజీల కామెడీ మంచి రిలాక్సేషన్ ఇస్తుంది. ద్వితీయార్ధంలో వచ్చే ఫ్లాష్ బ్యాక్, హీరో హీరోయిన్ల అసలు కథ, యాక్షన్ సీక్వెన్సెస్ ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతాయి. తన గత చిత్రాల తరహాలో కాకుండా, అజయ్ భూపతి ఎలాంటి రిస్క్ తీసుకోకుండా పూర్తిగా 'సేఫ్ గేమ్' ఆడేశారు. పకడ్బందీ స్క్రీన్ ప్లే, బలమైన క్యారెక్టరైజేషన్స్‌పై మరికాస్త దృష్టి పెట్టి ఉంటే ఈ లవ్ అండ్ యాక్షన్ డ్రామా మరో స్థాయిలో ఉండేది. జయకృష్ణ, రాషా తడాని తమ తొలి సినిమాతోనే అద్భుతమైన ప్రతిభను కనబరిచారు.

ముఖ్యంగా జయకృష్ణ ఎమోషనల్ సన్నివేశాల్లో మంచి పరిణతి చూపించాడు. డాన్సులు, యాక్షన్ సీక్వెన్స్‌లలోనూ ఆకట్టుకున్నాడు. రాషా తడాని కూడా తన అందం, అభినయంతో తొలి చిత్రంతోనే మంచి మార్కులు కొట్టేసింది. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ సినిమాకే హైలైట్‌గా నిలిచింది. మోహన్ బాబు తన సీనియారిటీతో, పవర్ ఫుల్ ఇంటెన్సిటీతో పాత్రకు పూర్తి వన్యాయం చేశారు. కిక్ శ్యామ్, అజయ్ తమ విలనిజంతో సినిమాను నిలబెట్టగా.. బ్రహ్మాజీ, నరేష్‌ల కామెడీ అక్కడక్కడా నవ్విస్తుంది. దర్శకుడు అజయ్ భూపతి ఎంచుకున్న లవ్ అండ్ ఫ్యాక్షన్ బ్యాక్‌డ్రాప్ బాగుంది. సంగీత దర్శకుడు జీవి ప్రకాష్ కుమార్ అందించిన పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమా స్థాయిని పెంచాయి. ముఖ్యంగా స్క్రీన్ పై పాటలు మరింత రిచ్‌గా కనిపిస్తాయి.

# రామాయణ ట్రైలర్ విడుదల

**అద్భుత దృశ్య కావ్యంగా మలచిన నితీశ్ తివారి**

ఎన్నిసార్లు విన్నా.. ఎంతమంది చెప్పినా.. ఎన్ని యుగాలు మారినా అజరామరం రామ చరితం.. 'రామాయణం' నిత్య నూతనం. ఇప్పటికే ఎన్నోసార్లు దృశ్యరూపం దాల్చిన ఈ మహాకావ్యం ఇప్పుడు మరోసారి నేటితరం ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. దర్శకుడు నితీశ్ తివారీ మలిచిన 'రామాయణ' ట్రైలర్ బ్రహ్మ ముహూర్తంలో ప్రేక్షకుల ముందుకొచ్చింది. అత్యున్నత నిర్మాణ విలువలు, అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్, అబ్బురపరిచేలా ఉన్న హాలీవుడ్ స్థాయి గ్రాఫిక్స్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. సీతారాముల కల్యాణం, వనవాసం, రామరావణుడి యుద్ధం.. ఇలా ప్రతి ఫ్రేమ్ ఆ అద్భుత గాథను కళ్లకు కడుతోంది. దేవలోకం.. భూలోకం.. పాతాళలోకం.. ముల్లోకాల్లో ఇక ఒక్కటే సామ్రాజ్యం.. రావణ రాజ్యం' అంటూ యశ్ పాత్రను పరిచయం చేస్తూ ట్రైలర్ ప్రారంభమైంది. యశ్ స్క్రీన్‌పై కనిపించిన ప్రతిసారీ తన గాంభీర్యం ప్రేక్షకులను మైమరిపించింది. 'చీకట్లను పారదోలేందుకు ప్రతి యుగంలోనూ ఆ శ్రీమహావిష్ణువు అవతారమెత్తుతాడు' అంటూ రాముడి పాత్రను తీర్చిదిద్దిన విధానం ఆకట్టుకుంది. ప్రశాంతత, ధర్మనిష్ఠను ప్రతిబింబించే రాముడిగా రణ్‌బీర్ కపూర్ ఆకట్టుకున్నారు. మొత్తం నాలుగు నిమిషాల ఈ ట్రైలర్ సినీ ప్రేక్షకులను త్రేతాయుగానికి తీసుకెళ్లింది. ట్రైలర్‌లో ఎక్కువ చర్చిస్తున్న పాత్రల్లో ఒకటి సీతాదేవి. సాధారణంగా మృదుస్వభావిగా చూపించే సీతమ్మను ఇందులో ఖడ్గం పట్టిన యోధురాలిగా చూపించారు. లక్ష్మణ రేఖ సందర్భంలో కూడా ఆమె చేతిలో ఖడ్గం కనిపించడంతో ఇందులో ఆమె పాత్రను కొత్తగా చూపించనున్నట్లు అర్థమవుతోంది. పుష్పక విమానం




రామాయణంలో ఎంతో కీలకం. గతంలో వచ్చిన చిత్రాల్లో ఇది సాధారణంగా కనిపించినా.. ఈ సినిమాలో మాత్రం భారీ తామరపువ్వు ఆకారంలో ప్రత్యేక డిజైన్‌తో చూపించారు. ఇక, లంకను జయించిన తర్వాత మూడు లోకాలపై ఆధిపత్యం సాధించాలని రావణుడు సంకల్పిస్తాడు. ఈ క్రమంలో దేవేంద్రుడితో యుద్ధానికి సంబంధించిన సన్నివేశాల్లో ఐరావతాన్ని అద్భుతమైన విజువల్‌తో






ఆవిష్కరించారు. సీతను అపహరించే సమయంలో రావణుడిని అడ్డుకునే జటాయువు పాత్రకు ట్రైలర్‌లో మంచి ప్రాధాన్యం దక్కింది. భారీ గరుత్మంతుడిలా, శక్తిమంతమైన రూపంలో జటాయువును చూపించడం విశేషం. శూర్పణఖ భర్త విద్యుజ్జిహ్వ పాత్రలో వివేక్ ఒబెరాయ్ కనిపించారు. రావణుడికి ఆయనకు మధ్య జరిగే ఘర్షణ చూస్తుంటే.. ఇప్పటివరకూ రామాయణంలో తెరపైకి రాని పాత్రలకు కూడా సముచిత స్థానం కల్పించినట్లు తెలుస్తోంది. రాముడి వనవాసానికి కారణమైన మంథర పాత్రను శీబా చద్దా పోషించారు. కైకేయిగా లారా దత్త ప్రత్యేకంగా కన్పించారు. శివధనుస్సు విరిచిన అనంతరం పరశురాముడు రాముడిని కలిసే ఘట్టం కూడా ట్రైలర్‌లో ఉంది. తన ధర్మ బాధ్యతలను రాముడికి అప్పగించి తపస్సు కోసం వెళ్లే పరశురాముడి పాత్రలోనూ రణ్‌బీర్ కన్పించడం ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేసింది. రాముడిని తిరిగి అయోధ్యకు తీసుకురావడానికి చిత్రకూటానికి వెళ్తాడు భరతుడు. రాముడు నిరాకరించడంతో ఆయన పాదుకలను సింహాసనంపై ఉంచి రాజ్యాన్ని పాలించిన సోదరుడిగా ఆదినాథ్ కొఠారే ఆకట్టుకున్నారు. హనుమంతుడిగా సన్నీ దేవోల్, లక్ష్మణుడిగా రవీ దూబే కూడా తమ పాత్రలకు న్యాయం చేశారు. రకుల్ ప్రీత్ సింగ్ శూర్పణఖ పాత్రలో కనిపించి ఔరా అనిపించారు. రాముడిని ఆకర్షించేందుకు ప్రయత్నించడం, లక్ష్మణుడు ఆమె ముక్కు కోసే సన్నివేశాలు ప్రత్యేకంగా నిలిచాయి. 'ప్రతీకారం తీర్చుకుం టాను శూర్పణఖ.. రాముడికి జరిగే అవమానం ఘోరంగా ఉంటుంది' అంటూ యశ్ చెప్పే డైలాగ్‌తో రామ-రావణ యుద్ధం ఎంత భీకరంగా ఉంటుందో ట్రైలర్‌లో హింట్ ఇచ్చారు దర్శకుడు. ఇక ట్రైలర్‌లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన మరో విషయం.. నేపథ్య సంగీతం.. ప్రపంచ ప్రఖ్యాత సంగీత దర్శకుడు హాన్స్ జిమ్మర్‌తో పాటు ఏ.ఆర్. రెహమాన్ అందించిన సంగీతం సినిమా స్థాయిని మరింత పెంచేలా ఉంది. విజువల్స్‌కు తగ్గట్టుగా వినిపించిన సంగీతం.. ప్రతి సన్నివేశానికి వీక్షకులు లీనమయ్యేలా ఉంది. 'రామాయణ' ట్రైలర్ కేవలం ఓ సినిమా ప్రమోషన్‌లా కాకుండా భారతీయ ఇతిహాసాన్ని ప్రపంచ స్థాయిలో ఆవిష్కరించే మహత్తర సినీ ప్రయాణానికి నాందిగా నిలిచింది. మొదటి భాగం ఈ ఏడాది దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా విడుదల చేసిన ట్రైలర్‌లో విజువల్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి రూ.4000 కోట్ల బ్జడెట్‌తో ఈ చిత్రం రూపొందుతోంది. రామానంద్ సాగర్ ఆవిష్కరించిన ధారావాహికలో రాముడిగా కనువిందు చేసిన అరుణ్ గోవిల్ ఇప్పుడు దశరథుడిగా నటిస్తున్నారు. సీబా చద్దా.. మంథర పాత్ర పోషిస్తుండగా, శిశిర్ శర్మ వశిష్ఠ మహర్షిగా, అజింక్య దేవ్ విశ్వామిత్ర మహర్షిగా చేస్తున్నారు.


## లెనిన్ సరికొత్త రికార్డులు

**వందకోట్ల క్లబ్బులో అఖిల్ లెనిన్ చేరిక**




టాలీవుడ్ యువ సామ్రాట్ అఖిల్ అక్కినేని కెరీర్‌లో ఓ సరికొత్త చరిత్రాత్మక అధ్యాయం మొదలైంది. ఆయన నటించిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ లెనిన్ చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుతాలు సృష్టిస్తూ, ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్ల మైలురాయిని విజయవంతంగా అధిగమించింది. దీంతో అఖిల్ కెరీర్‌లో తొలి బ్లాక్ బస్టర్‌ను నమోదు చేయడంతో పాటు తొలి రూ.100 కోట్ల సినిమాగా రికార్డుల కెక్కింది. జూలై 10న భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా, తొలి ఆట నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుని బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టించింది. దర్శకుడు మురళి కిషోర్ అబ్బూరు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ముఖ్యంగా సినిమాలో అఖిల్ కొత్త మేకోవర్, పవర్ ప్యాక్డ్ మాస్ యాక్షన్ సీక్వెన్స్‌లు, హై-ఓల్టేజ్ ఎమోషనల్ సన్నివేశాలు థియేటర్లలో ప్రేక్షకులను కట్టిపడేశాయి. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ సంయుక్తంగా అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని నిర్మించాయి. నిర్మాత నాగవంశీ, నాగార్జున అనుసరించిన పబ్లిసిటీ వ్యూహాలు సినిమా విజయంలో కీలక పాత్ర పోషించాయి. ఇక తమ అభిమాన హీరో అఖిల్ ఖాతాలో తొలి బి÷-గగెస్ట్ బ్లాక్‌బస్టర్ హిట్ పడటంతో అక్కినేని అభిమానులు సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటున్నారు. సినిమా విజయాన్ని పురస్కరించుకుని చిత్ర యూనిట్ కూడా సంతోషం వ్యక్తం చేస్తూ ప్రేక్షకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


## విశ్వంభరతో పోటీ పడనున్న జైలర్-2





అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకోవడానికి ఆయన అభిమానులు ఇప్పటినుంచే ఇప్పటి నుంచే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అయితే ఆగష్టు 22న రానున్న మెగాస్టార్ బర్త్ డే కానుకగా ఆయన నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ సోషియో-ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' నుంచి అదిరిపోయే అప్‌డేట్ రాబోతున్నట్లు తెలుస్తుంది. దర్శకుడు మల్లిడి వశిష్ట తెరకెక్కిస్తున్న ఈ భారీ బ్జడెట్ చిత్రం, విజువల్ ఎఫెక్ట్స్ పనుల కారణంగా ఇంతకాలం ఆలస్యం అయినప్పటికీ, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను శరవేగంగా ముగింపు దశకు తీసుకువచ్చింది. యూవీ క్రియేషన్స్ సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో అందాల తార త్రిష నటిస్తుండగా, ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి అద్భుతమైన బాణీలు, నేపథ్య సంగీతాన్ని అందిస్తున్నారు. కాగా, ఈ సోషియో-ఫాంటసీ అడ్వెంచర్‌ను దసరా పండుగకు టా÷-గ్గ÷ట్ చేస్తూ అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన ఆగస్టు 22న చిరంజీవి జన్మదిన వేడుకల సందర్భంగా చిత్రబృందం ప్రకటించబోతున్నట్లు సమాచారం. అయితే చిరంజీవి దసరా పండుగకు రాబోతుండటం అంతకంటే ఒక్కరోజు ముందుగానే రజనీకాంత్ జైలర్ 2 ప్రేక్షకులు రాబోతుండడంతో ఈ రెండు సినిమాలకు బాక్సాఫీస్ వద్ద బిగ్ క్లాష్ ఉండబోతున్నట్లు తెలుస్తుంది. ఇక ఈ భారీ పోటీతో టాలీవుడ్ వర్సెస్ కోలీవుడ్ బాక్సాఫీస్ వార్ తారాస్థాయికి చేరడం ఖాయమని ట్రేడ్ నిపుణులు భావిస్తున్నారు.

## సూర్య 47 దీపావళి బరికోసం సిద్ధం




తమిళ స్టార్ హీరో సూర్యకు ఇప్పటికే వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. రీసెంట్ గా జితు మాధవన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సూర్య47' షూటింగ్‌ను పూర్తి చేశారు. చిత్రబృందం విడుదల చేసిన బీహైండ్ ది సీన్స్ వీడియోతో షూటింగ్ ముగిసిన విషయాన్ని అధికారికంగా వెల్లడించగా, ఇప్పుడు ఈ సినిమా విడుదల తేదీపై ఆసక్తికర చర్చ మొదలైంది. అందుతున్న సమాచారం ప్రకారం, 'సూర్య47'ను ఈ దీపావళి సందర్భంగా థియేటర్లలో విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

# అంతర్జాతీయ క్రికెట్‌కు అజింక్య రహానే గుడ్‌బై..



భారత స్టార్ బ్యాటర్, మాజీ వైస్ కెప్టెన్ అజింక్య రహానే అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. సుమారు 17 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు ముగింపు పలుకుతూ సోషల్ మీడియా వేదికగా అభిమానులతో ఒక భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నాడు. టీమిండియా మాజీ వైస్ కెప్టెన్, క్లాసిక్ బ్యాటర్ అజింక్య రహానే అంతర్జాతీయ క్రికెట్‌కు అధికారికంగా వీడ్కోలు పలికాడు. తన 17 ఏళ్ల సుదీర్ఘ క్రికెట్ ప్రయాణానికి ముగింపు పలుకుతూ గురువారం సోషల్ మీడియాలో ఒక ఎమోషనల్ వీడియో ద్వారా రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెల్లడించాడు. జీవితంలో సరైన సమయం వచ్చినప్పుడు దాన్ని గౌరవించి ముందుకు సాగక తప్పదని ఈ సందర్భంగా అతడు ఉద్వేగభరితంగా పేర్కొన్నాడు. తనకు అండగా నిలిచిన బీసీసీఐకి, తన తోటి ఆటగాళ్లకు, కోచ్‌లకు, కోట్లాది మంది అభిమానులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపాడు. 2011లో ఇంగ్లండ్‌పై టీ20 మ్యాచ్‌తో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన రహానే, ఆ తర్వాత కొన్ని రోజులకే రాహుల్ ద్రావిడ్ ఫేర్‌వెల్ సిరీస్‌లో వన్డేల్లోకి ఎంట్రీ ఇచ్చాడు. ఇక 2013లో ఢిల్లీ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌తో టెస్ట్ క్రికెట్‌లోకి అడుగుపెట్టాడు. విరాట్ కోహ్లీ, పుజారాలతో కలిసి మిడిలార్డర్‌లో భారత జట్టుకు బలమైన వెన్నెముకగా నిలిచాడు. కఠినమైన విదేశీ పిచ్‌లపై అతడు ఆడిన అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. ఆస్ట్రేలియా గడ్డపై 2020-21 బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భారత జట్టును ముందుండి నడిపించిన తీరు అతడి కెరీర్‌లోనే ఒక సువర్ణాధ్యాయం. కోహ్లీ గైర్హాజరీలో జట్టు బాధ్యతలు చేపట్టి, యువ ఆటగాళ్లతో అద్భుతాలు సృష్టించాడు. మెల్‌బోర్న్‌లో అద్భుతమైన సెంచరీ సాధించి జట్టుకు చారిత్రాత్మక సిరీస్ విజయాన్ని అందించాడు. ఆ సిరీస్ అతడి నాయకత్వ లక్షణాలను ప్రపంచానికి చాటిచెప్పింది. భారత్ తరఫున 85 టెస్టులు ఆడిన రహానే 5077 పరుగులు సాధించాడు. అలాగే 90 వన్డేల్లో 2962 పరుగులు, 20 టీ20 మ్యాచుల్లో 375 పరుగులు తన ఖాతాలో వేసుకున్నాడు. జులై 2023లో వెస్టిండీస్‌తో జరిగిన టెస్ట్ మ్యాచే అతడి కెరీర్‌లో ఆఖరి అంతర్జాతీయ మ్యాచ్. అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించినప్పటికీ, ఐపీఎల్ లాంటి ఫ్రాంచైజీ లీగ్స్‌తో పాటు దేశవాళీ క్రికెట్‌లో తాను కొనసాగుతానని రహానే స్పష్టం చేశాడు. ఈ ఏడాది ఐపీఎల్ 2026లో కూడా అతడు ఆడాడు. పదేళ్లకు పైగా తన అద్భుత ఆటతో కోట్లాది మంది మనసులు గెలుచుకున్న ఈ సైలెంట్ వారియర్ రిటైర్మెంట్ వార్త అభిమానులను తీవ్రంగా నిరాశపరిచింది.

## ఇంగ్లండ్ టెస్ట్ టీమ్ హెడ్ కోచ్ గా స్టీఫెన్ ఫ్లెమింగ్




చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) హెడ్ కోచ్ పదవి బాధ్యతల నుంచి తప్పుకున్న స్టీఫెన్ ఫ్లెమింగ్‌కు జాక్‌పాట్ తగిలింది. తంతే బూరెల బుట్టలో పడ్డట్టు.. ఏకంగా ఇంగ్లండ్ టెస్ట్ టీమ్ హెడ్ కోచ్ పదవి వరించింది. 18 ఏళ్ల తర్వాత ఫ్లెమింగ్‌పై సీఎస్‌కే వేటు వేగయా.. ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు.. హెడ్ కోచ్‌గా స్వాగతం పలికింది. ఇంగ్లండ్ టెస్ట్ టీమ్ సారథిగా తిరిగి జోరూట్‌ను ఎంపిక చేసింది.బెన్ స్టోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికడంతో అనుభవం కలిగిన జోరూట్‌కే ఇంగ్లండ్ వేల్స్ క్రికెట్ బోర్డు(ఈసీబీ) మళ్లీ సారథ్య బాధ్యతలు కట్టబెట్టింది. బ్రెండన్ మెక్‌కల్లమ్ స్థానంలో స్టీఫెన్ ఫ్లెమింగ్‌ను టెస్ట్ టీమ్ కోచ్‌గా నియమించింది. ఈ మేరకు ఈసీబీ గురువారం ఒక ప్రకటనను విడుదల చేసింది. స్టీఫెన్ ఫ్లెమింగ్ నియామకాన్ని ఈసీబీ బోర్డు ప్యానెల్ ఏకగ్రీవంగా ఆమోదించిందని పేర్కొంది. క్రికెట్ ప్రపంచంలోనే అత్యంత గౌరవనీయమైన కోచ్‌ల్లో ఒకరైన ఫ్లెమింగ్ రాకతో టెస్ట్ క్రికెట్‌లో ఇంగ్లండ్‌కు ఒక కొత్త శకం మొదలవుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది. ఇంగ్లండ్ టెస్ట్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టడం చాలా సంతోషంగా ఉందని ఫ్లెమింగ్ తెలిపాడు. 'టెస్ట్ కోచ్‌గా ఇంగ్లండ్ జట్టులో చేరబోతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ప్రపంచ క్రికెట్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన కోచింగ్ పదవుల్లో ఇది ఒకటి. అలాంటి పదవి బాధ్యతలను చేపట్టడాన్ని గౌరవంగా భావిస్తున్నా. ఆటగాళ్లతో పని చేయడానికి, బ్రెండన్ మెక్‌కల్లమ్, బెన్ స్టోక్స్ సాధించిన ప్రగతిని కొనసాగించేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా. స్వల్ప కాలిక, దీర్ఘ కాలిక ప్రణాళికలతో జట్టుకు విజయాలను అందించే ప్రయత్నం చేస్తాం. జట్టులోని యువ ప్రతిభావంతులకు సాయం చేయడమే మా ప్రధాన లక్ష్యం.'అని ఫ్లెమింగ్ చెప్పుకొచ్చాడు. న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ అయిన స్టీఫెన్ ఫ్లెమింగ్.. చెన్నై సూపర్ కింగ్స్ హెడ్ కోచ్‌గా 18 ఏళ్ల సేవలందించాడు. ఈ 18 సంవత్సరాల్లో 10 సార్లు జట్టును ఫైనల్‌కు చేర్చడంతో పాటు ఐదు టైటిళ్లు అందించాడు. సీఎస్‌కేకు చెందిన ఇతర గ్లోబల్ ఫ్రాంచైజీలకు కూడా కోచ్‌గా సేవలందించాడు.

# ఫైనల్‌లోకి దూసుకెళ్లిన నీరజ్ చోప్రా




స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో జరుగుతున్న 2026 కామన్వెల్త్ గేమ్స్‌లో భారత స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా జావెలిన్ త్రో ఫైనల్‌కు అర్హత సాధించాడు. స్కాట్లాండ్‌లోని గ్లాస్గో వేదికగా జరుగుతున్న 2026 కామన్వెల్త్ గేమ్స్ ఎనిమిదో రోజు పోటీలు ఆసక్తికరంగా కొనసాగుతున్నాయి. భారత అథ్లెటిక్స్ జట్టుకు శుభవార్తగా, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత నీరజ్ చోప్రా పురుషుల జావెలిన్ త్రో ఫైనల్‌కు అర్హత సాధించాడు. అతనితో పాటు భారత అథ్లెట్లు యశ్‌వీర్ సింగ్, రోహిత్ యాదవ్ కూడా ఫైనల్‌లోకి ప్రవేశించారు. దీంతో జావెలిన్ త్రో విభాగంలో భారత్‌కు పతక అవకాశాలు మరింత బలపడ్డాయి. ఈ విభాగానికి సంబంధించిన పతకాల పోటీలు జూలై 31న జరగనున్నాయి. ప్రస్తుతం కామన్వెల్త్ గేమ్స్‌లో అథ్లెటిక్స్, వెయిట్‌లిఫ్టింగ్, బాల్స్ పోటీలు కొనసాగుతుండగా, ట్రాక్ సైక్లింగ్‌లో కూడా భారత్ తన ప్రచారాన్ని ప్రారంభించనుంది. భారత క్రీడాభిమానుల దృష్టి ఇప్పుడు జావెలిన్ త్రో ఫైనల్‌పై కేంద్రీకృతమైంది. స్వర్ణ పతకానికి ప్రధాన పోటీదారుడిగా భావిస్తున్న నీరజ్ చోప్రా క్వాలిఫికేషన్ రౌండ్‌లో అంచనాలకు తగ్గ ప్రదర్శన చేయకపోయినా, ఫైనల్‌లోకి సులభంగా అర్హత సాధించాడు. జావెలిన్ త్రోలో నేరుగా ఫైనల్‌కు చేరాలంటే 85 మీటర్ల క్వాలిఫికేషన్ మార్క్‌ను అధిగమించాల్సి ఉంటుంది. అయితే తొలి ప్రయత్నంలో నీరజ్ 76.28 మీటర్లు మాత్రమే విసరగలిగాడు. దీంతో నేరుగా అర్హత సాధించే మార్క్‌ను అందుకోలేకపోయాడు. అయితే రెండో ప్రయత్నంలో తన ప్రదర్శనను మెరుగుపరుచుకున్న నీరజ్ 79.61 మీటర్లు జావెలిన్ విసిరి మొత్తం ఫలితాల్లో ఐదో స్థానంలో నిలిచాడు. దీంతో ఫైనల్‌కు అర్హత సాధించాడు. భారత జట్టుకు చెందిన మరో ఇద్దరు జావెలిన్ త్రోయర్లు కూడా మంచి ప్రదర్శన కనబరిచారు. రోహిత్ యాదవ్ 78.37 మీటర్లు, యశ్‌వీర్ సింగ్ 74.45 మీటర్లు నమోదు చేసి ఇద్దరూ ఫైనల్‌లో చోటు దక్కించుకున్నారు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో పాకిస్థాన్ ఒలింపిక్ ఛాంపియన్ అర్షద్ నదీమ్ తొలి ప్రయత్నంలోనే విఫలమవడం ఆసక్తికరంగా మారింది. అనంతరం మూడు ప్రయత్నాలు పూర్తి చేసిన అతను గరిష్టంగా 78.63 మీటర్లు మాత్రమే నమోదు చేశాడు. ఫైనల్‌లో నీరజ్ చోప్రాకు అర్షద్ నదీమ్‌తో పాటు శ్రీలంకకు చెందిన యువ ప్రపంచ ఛాంపియన్ రుమేష్ పతిరాగేల నుంచి గట్టి సవాల్ ఎదురుకానుంది. ఈ ముగ్గురు మధ్య స్వర్ణ పతక పోరు ఉత్కంఠభరితంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు మహిళల 4000 మీటర్ల క్వాలిఫికేషన్ రేసులో భారత్‌కు నిరాశ ఎదురైంది. భారత అథ్లెట్ లీషా దాస్ 6:58.000 నిమిషాల్లో రేసును పూర్తి చేసినప్పటికీ ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయింది. ఇంగ్లాండ్‌కు చెందిన మోర్గాన్ న్యూబెర్రీ కంటే ఆమె 1 నిమిషం 51 సెకన్లు వెనుకబడటంతో ఐదో స్థానానికి పరిమితమైంది. ఆస్ట్రేలియాకు చెందిన ఎరిన్ నార్మోయిల్ (5:24.264), ఇంగ్లాండ్‌కు చెందిన కదీనా కాక్స్ (6:37.119) ప్రదర్శనల నేపథ్యంలో లీషా ఫైనల్ బెర్త్‌ను కోల్పోయింది. ఇదిలా ఉండగా, కామన్వెల్త్ గేమ్స్‌లో భారత క్రీడాకారులకు బుధవారం చారిత్రాత్మక రోజుగా నిలిచింది. భారత బాక్సర్లు ఏకంగా 10 పతకాలను ఖాయం చేయగా, లాంగ్ జంప్ స్టార్ మురళీ శ్రీశంకర్ కామన్వెల్త్ గేమ్స్ చరిత్రలో వరుసగా రెండు పతకాలు గెలిచిన తొలి భారత లాంగ్ జంపర్‌గా రికార్డు సృష్టించాడు.

# భారత హాకీ కిట్ కలర్ మార్పుపై రచ్చ!

భారత హాకీ జట్ల జెర్సీ రంగును బ్లూ నుంచి కాషాయ రంగుకు (ఆరెంజ్) మార్చడంపై మాజీ కెప్టెన్ వీరేన్ రస్కిన్హా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే ఇందులో ఎలాంటి రాజకీయ కోణం లేదని హాకీ ఇండియా స్పష్టం చేసింది. వచ్చే నెలలో బెల్జియం, నెదర్లాండ్స్ వేదికగా జరగనున్న ఎఫ్ఐహెచ్ హాకీ వరల్డ్ కప్ 2026 కోసం భారత పురుషుల, మహిళల జట్లు సిద్ధమవుతున్నాయి. ఈ మెగా టోర్నీ కోసం హాకీ ఇండియా (హెచ్ఐ) జాతీయ జట్ల జెర్సీ రంగును అనూహ్యంగా మార్చేసింది. దశాబ్దాలుగా భారత జట్టుకు ఐడెంటిటీగా ఉన్న సంప్రదాయ బ్లూ జెర్సీ స్థానంలో కొత్తగా కాషాయం (ఆరెంజ్) రంగు కిట్‌ను పరిచయం చేసింది. ఈ నిర్ణయంపై భారత హాకీ జట్టు మాజీ కెప్టెన్ వీరేన్ రస్కిన్హా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జెర్సీ రంగు మార్చడం వెనుక ఉన్న లాజిక్ ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ రంగు మార్పుపై సోషల్ మీడియాలో సైతం పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఈ వివాదంపై స్పందించిన హాకీ ఇండియా సీనియర్ అధికారి ఒకరు.. ఇందులో ఎలాంటి రాజకీయ కోణం లేదని కొట్టిపారేశారు. జాతీయ జెండాలో కాషాయం ఒక భాగమని, మార్పును ఎప్పుడూ స్వాగతించాలని ఆయన సూచించారు. సంప్రదాయ బ్లూ జెర్సీని మార్చడానికి ప్రధాన కారణం ఆటగాళ్ల విజిబిలిటీ అని ఆ అధికారి వివరించినట్లు న్యూస్18 ఇంగ్లీష్ కథనం పేర్కొంది. ప్రస్తుతం అంతర్జాతీయ హాకీ మ్యాచ్‌లు ఎక్కువగా బ్లూ టర్ఫ్ (మైదానం) పైనే జరుగుతున్నాయి. మైదానం రంగు, జెర్సీ రంగు ఒకేలా ఉండటం వల్ల ఆటగాళ్లను గుర్తించడం వీక్షకులకు కష్టంగా మారుతోంది. ఆరెంజ్ రంగు వల్ల కాంట్రాస్ట్ పెరిగి, టర్ఫ్‌పై ఆటగాళ్లు స్పష్టంగా కనిపిస్తారని ఆయన పేర్కొన్నారు. కొత్త కిట్‌ను ఆవిష్కరిస్తూ హాకీ ఇండియా ట్విట్టర్ (ఎక్స్) వేదికగా ఆసక్తికరమైన పోస్ట్ చేసింది. జెర్సీలోని ప్రతి కుట్టు ఒక కథను చెబుతుందని, ప్రతి రంగు దేశ గర్వాన్ని చాటుతుందని పేర్కొంది. కాషాయ రంగు ధైర్యం, త్యాగం, విజయాలకు ప్రతీక అని వెల్లడించింది. ఉదయిస్తున్న సూర్యుడి స్ఫూర్తితో రూపొందించిన ఈ డిజైన్ సరికొత్త ఆరంభానికి సంకేతమని వివరించింది. ఇందులో తెలుపు రంగు ప్రత్యామ్నాయ జెర్సీలు కూడా ఉంటాయి. జెర్సీ మార్పు నిర్ణయం తనకు ఎంతో ఇబ్బందికరంగా అనిపించిందని వీరేన్ రస్కిన్హా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. భారత జట్టు వారసత్వం, గుర్తింపు ఎప్పుడూ 'బ్లూ' రంగుతోనే ముడిపడి ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. ఎన్నో ఏళ్ల పాటు గర్వంగా బ్లూ జెర్సీ ధరించానని, అభిమానులు కూడా మన జట్టును ఆ రంగులోనే చూడాలని కోరుకుంటారని అభిప్రాయపడ్డారు. తన వాదన కేవలం జాతీయ జట్టు గుర్తింపు, వారసత్వం గురించేనని రస్కిన్హా స్పష్టం చేశారు.



# వన్డే వరల్డ్‌కప్ వేదికలు ఖరారు..

## మూడు దేశాల్లోని ఆతిథ్య నగరాలివే..!

క్రికెట్ అభిమానులకు గుడ్‌న్యూస్. వచ్చే ఏడాది పురుషుల వన్డే ప్రపంచకప్ వేదికలను అంతర్జాతీయ క్రికెట్ మండలి(×జజ) ప్రకటించింది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియాలు సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీని మొత్తంగా 12 నగరాల్లో నిర్వహించనుంది ఐసీసీ. అయితే.. సింహభాగం మ్యాచ్‌లు దక్షిణాఫ్రికాలోనే జరగనున్నాయని ఐసీసీ గురువారం వెల్లడించింది. జింబాబ్వేలోని మూడు, నమీబియాలో ఒకేఒక నగరంలో ప్రపంచకప్ మ్యాచ్‌లు ఆడిస్తామని అత్యున్నత బోర్డు పేర్కొంది. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ వేదికలు ఖరారయ్యాయి. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియాలు సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నమెంట్ మొత్తంగా 12 నగరాల్లో జరగనుంది. ఆధునిక స్టేడియాల, మౌలిక వసతులు, ప్రేక్షకుల ఆదరణ.. ఈ మూడు విషయాలను దృష్టిలో పెట్టుకొని దక్షిణాఫ్రికాలోనే 8 సిటీలను ఎంపిక చేసింది ఐసీసీ. జింబాబ్వేలోని మూడు, నమీబియాలోని విండ్‌హోక్ నగరంలో ప్రపంచకప్ మ్యాచ్‌లు అభిమానులను అలరించనున్నాయి. 2027 అక్టోబర్ 4వ తేదీ నుంచి నవంబర్ 21 వరకూ వరల్డ్‌కప్ జరగనుంది. మెగా టోర్నీకి 14 జట్లు అర్హత సాధించగా.. 54 మ్యాచ్‌ల అనంతరం విజేత ఎవరో తేలిపోనుంది. దక్షిణాఫ్రికా -- జొహన్నెస్‌బర్గ్, సెంచూరియన్, కేప్‌టౌన్, దర్బన్, కెబెర్హ, బ్లోఎమ్‌ఫోంటెన్, పార్ల్, కుగుపో సిటీ.జింబాబ్వే -- హరారే, బులవాయో, విక్టోరియా ఫాల్స్‌న మీబియా -- విండ్‌హోక్.




Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609